హనీబీఎపి
సంపుటి 3, సంచిక 3
జనవరి - మార్చి 2009


# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక



## పేటెంట్ గ్రహీత ఆదిలాబాద్ ఆదివాసి విక్రమ్ రాథోడ్

# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్త లతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాంక్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీ' పునాదులను పటిష్టం చేశాయి.

ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు :

- 74 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణలను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.
- నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.
- నలుగురు ఇన్నోవేటర్లను అహమ్మదాబాద్ లో జరిగిన జాతీయ సెమినార్‌కు పంపడం జరిగింది. వారికి లభించిన ఆదరణ, గౌరవం, సత్కారం తెలుగు ప్రజలకే గర్వకారణం.
- ✤ ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.
- ✤ కారంచేడులో జరిగిన జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శనలో 28 మంది ఇన్నోవేటర్లు పాల్గొని విజయవంతం చేశారు.
- ✤ నిజామాబాద్ ప్రాంతంలో మినీ శోధయాత్ర నిర్వహించి, ఏడుమంది పల్లె ఇన్నోవేటర్లను వెలికి తీయడం జరిగింది.
- ✤ ఇప్పటి వరకు 8 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది.
- ✤ టి.ఇ.పి.పి. ఛైర్మన్, డా. ఎ.ఎస్. రావు గారితో 16 మంది ఇన్నోవేటర్లతో ముఖాముఖి ఏర్పాటు చేయడం జరిగింది.
- ✤ తెలుగు పల్లె జ్ఞానం దోమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.
- ✤ హైదరాబాద్‌లో జనవరి 2008 ఉద్యాన వనశాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనలో 8 మంది తెలుగు ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా ఎంతోమంది వాటిని మెచ్చుకోవడం జరిగింది.
- ✤ జనవరి 2008లో విశాఖలో జరిగిన 95వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ముగ్గురు ఇన్నోవేటర్లు పాల్గొని ప్రశంసలు పొందారు.
- ✤ ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయలో శోధయాత్రను జనవరిలో నిర్వహించి, స్థానిక జ్ఞానాన్ని సేకరించడం జరిగింది.
- ✤ సెప్టెంబర్ 2008లో అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఇద్దరు హనీబీఏపి కార్యకర్తలు 'స్కౌటింగ్ & డాక్యుమెంటేషన్ వర్క్‌షాప్'లో పాల్గొనడం జరిగింది.
- ✤ అలేరు నివాసి, ఉత్తమ ఇన్నోవేటర్ చింతకింది మల్లేశం అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయ ఇన్నోవేషన్ సమావేశానికి ఆహ్వానించబడ్డారు.
- ✤ నెల్లూరులో ఆదిశంకర విద్యా సంస్థలో 'జరిగిన టెక్నాలజీ మేళా'లో 19 మంది ఇన్నోటర్లు పాల్గొనటం జరిగింది.
- ✤ 'పల్లెసృజన' త్రైమాసిక పత్రికను విజయవంతంగా ప్రచురిస్తూ మూడవ సంవత్సరంలోకి అడుగు పెట్టడం.
- ✤ 'టెప్' విజ్ఞాన సాంకేతిక విభాగం క్రేంద్ర ప్రభుత్వం ద్వారా ఇన్నోవేటర్లకు ఆర్థిక సహాయానికి తోడ్పడటం.
- ✤ ఎన్.ఐ.టి. వరంగల్‌లో నలుగురు ఇన్నోవేటర్లు 'ఇన్నోవేటర్ల సమావేశం'లో పాల్గొనటం.
- ✤ వెయ్యికి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం.
- ✤ దాదాపు తొమ్మిది మంది ఇన్నోవేటర్లకు తమ ఆలోచనలను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.
- ✤ ఇన్నోవేటర్లకు జాతీయ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక విజ్ఞాన మేనేజ్‌మెంట్ (నారమ్) లో వివిధ 'సెమినార్ల'లో శిక్షణా కార్యక్రమాల్లో అతిథిగా పాల్గొనేట్లు చేయటం.
- ✤ 16 మంది 'బిట్స్ పిలాని' విద్యార్థులతో వరంగల్ జిల్లా ఏటూరునాగారం, తొర్రూరు మండలాల్లోని పది గ్రామాల్లో 'జ్ఞానశోధ' చేయడం.

**మా కలలు :**

- ✤ ఏడవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.
- ✤ కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.
- ✤ పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

**– బ్రిగేడియర్ పి. గణేశం,**
కో–ఆర్డినేటర్, హనీబీఏపి,
ఫోన్ : 98660 01678.

# పల్లెసృజన

సంపుటి-3 సంచిక - 3 జనవరి - మార్చి 2009

**సంపాదకవర్గం**

సంపాదకులు :

**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సలహాదారులు :

**డా. కె.ఎల్. రావు**
**ప్రొ. అనిల్ గుప్త**
**డా. గీర్వాణి**
**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**
**డా. వై.వి. రావ్**
**శ్రీమతి అరుణ గణేశం**
**పల్లె వీర రాఘవ రెడ్డి**

డి.టి.పి. & డిజైనింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.**
ఫోన్ : 040- 42215350
సెల్ : 93913 75655, 92468 20655
E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన
102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555
E-mail : honeybeeap@gmail.com

## ఈ సంచికలో...

✤ పల్లెల్లో జ్ఞానశోధన.... ఓ అద్భుత అనుభవం ! 3
✤ ఊహలు గాలిపటాలైతే...? 8
✤ సామాన్యుడి 'అసామాన్య ఆలోచన' సులభమైన టీ మేకర్ 10
✤ సుస్థిర సేంద్రియ వ్యవసాయ పద్ధతులు 13
✤ ప్రయాణాల్లో చంటిపిల్లల సంరక్షణ 16
✤ ఇతర రాష్ట్రాలపల్లె కబుర్లు 17
✤ వరంగల్ జిల్లా ఆదివాసుల (కోయ) సంస్కృతి-ఆచారాలు-2 21
✤ తెలుగు ఇన్నోవేటర్లకు భారత ప్రభుత్వ ఆర్థిక సహాయం 24
✤ పేటెంట్ గ్రహీత ఆదిలాబాద్ ఆదివాసి 'విక్రం రాథోడ్' 25
✤ మల్టీ పర్పస్ బకెట్ : సౌకర్యవంతమైన బాత్రూం సెట్ 27

**కవర్ లోపలి పేజీల్లో :**

హనీబీఏపి ప్రగతి

**ఎన్.ఐ.ఎఫ్. 'ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేట్స్....'**
**సంకలనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేసిన పుస్తకం కవర్ పేజీ.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed & Published by : Brig. P. Ganesham, VSM (Poorva Senani), on behalf of "HoneyBeeAP"
102, Vayupuri, Sainikpuri Post, Secunderabad - 500 094. A.P.
Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 93913 75655

# సంపాదకీయం

జ్ఞానపరంగా ఆలోచిస్తే 'ప్రతి వృద్ధుని మరణం ఒక గ్రంథాలయం కాలిపోయినంత నష్టంగా పరిగణించవచ్చు' జ్ఞానానికి విలువ కట్టడం సులువు కాదు. కాని, జ్ఞానం ఎలాంటిదైనా తప్పక విలు వ ఉంటుంది. అది సమాజానికి ఎక్కడో, ఎప్పుడో తప్పక ఉపయోగ పడుతుంది. అందుకే జ్ఞానాన్ని మరుగున పడనీయకుండా కాపాడి వచ్చే తరాలకు అందించడం వర్తమానంలో వున్న మనందరి బాధ్యత.

నిర్ధారించబడిన ప్రకృతిలోని జ్ఞానమే విజ్ఞానం (సైన్స్). ఈ ప్రక్రియ ఎప్పుడూ జరుగుతుండటం వలన విజ్ఞాన పరిధి పెరుగుతూ వుంటుంది. ప్రస్తుత విద్యా విధానం విజ్ఞానాన్ని మాత్రమే బోధిస్తుంది. ప్రకృతిలోని జ్ఞానాన్ని పట్టించుకోదు. అందుకే విద్యావంతులు ప్రకృతిలో ఉన్న అపార జ్ఞానం గురించి అజ్ఞానులుగా వుంటారు. కాని, పల్లెల్లోని చదువులేని పామరులు మాత్రం ఈ ప్రకృతి జ్ఞానాన్ని ఎంతో చక్కగా అర్థం చేసుకుంటారు. ఈ జ్ఞానమే వారి ధనం. మరి విజ్ఞానవంతులైన విద్యావంతులు, జ్ఞానవంతులైన గ్రామీణులు - వీరిలో ఎవరు ఎక్కువ జ్ఞానధనులో .....

హనీబీ ఏపి కృషి అంతా ఈ గ్రామీణ జ్ఞానధనులపై కేంద్రీకరించబడింది. పల్లెల్లోని సాంప్రదాయ జ్ఞానం, ప్రకృతితో ఉన్నవారి సామరస్యం, క్రియాశీలతలను వెతికి డాక్యుమెంట్ చేయటం 'హనీబీఏపి' ప్రధాన కార్యక్రమం. ఇందులో ముఖ్యంగా విద్యార్థులు పాల్గొనటానికి కృషి సాగుతున్నది. ఈ ప్రయత్నంలో గత జూన్ మాసంలో 'బిట్స్‌పిలానీ' విద్యార్థులు హనీబీఏపి సహకారంతో 15 రోజులు 'జ్ఞానశోధ' కార్యక్రమంలో వరంగల్ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమం దేశంలో ప్రప్రథమంగా మన తెలుగు రాష్ట్రంలో జరగటం ముదావహం.

ఇంజనీరింగ్ విద్యార్థులైన తేజస్విని, మీరజ్, పవన్‌లు ఈ కార్యక్రమంలో భాగంగా తొర్రూరు మండలంలోని దుబ్బతాండ, ఏటూరు నాగారం మండలంలోని కమలాపురంలలో జ్ఞానశోధ చేశారు. వారి తరుపున తేజస్విని వ్రాసిన విస్మయాత్మక అనుభవాలను, మరువలేని అనుభూతులను పల్లెసృజన పాఠకులకై ఈ సంచికలో ప్రచురించాం.

ఆదిలాబాద్ జిల్లా వాస్తవ్యుడు, ఆదివాసి, విక్రం రాథోడ్ జ్ఞానానికి, క్రియాశీలతకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పేటెంట్‌ను ప్రసాదించింది. బహుశా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవస్థాపరంగా కాకుండా వ్యక్తిపరంగా, అదీ ఒక ఆదివాసికి ఇలాంటి గుర్తింపు రావటం ప్రథమమే అయి వుంటుంది. హనీబీఏపి హర్షానికి అంతులేదు. పల్లెజ్ఞానాన్ని సమాజం గుర్తించటం, హనీబీ స్వచ్ఛంద కార్యకర్తలకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. ఈ ప్రయత్నం సఫలం కావటంలో సహకరించిన ప్రొ. అనిల్ గుప్తా గారికి, ఎన్.ఐ.ఎఫ్. సిబ్బందికి, పేటెంట్ లాయర్లకు, ప్రభుత్వ సంస్థలకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. పేటెంట్ వివరాలను ఈ సంచికలో ప్రచురించాం.


ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ డా. విజయ్ కేల్కర్ గారు ఆగస్ట్ ప్రథమంలో మన రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులకై వచ్చిన సందర్భంలో ఎన్.ఐ.ఎఫ్. తరుపున 'ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేట్స్....' అన్న సంకలనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారికి అందజేశారు. దాని కవర్ పేజీని, ఈ సంచికలో ప్రచురించాం. ఇందులో తెలుగు ఇన్నోవేటర్ల వివరాలు, మన రాష్ట్రానికి అవసరమయ్యే ఇతర రాష్ట్రాల ఇన్నోవేషన్ల గురించి వ్రాశారు. ఎన్.ఐ.ఎఫ్., హనీబీ నెట్‌వర్క్, హనీబీఏపి కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వం సముచిత సహాయం చేయాలని డాక్టర్ విజయ్ కేల్కర్ రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు.

ప్రచురణలో రెండు సంచికలు వెనుకబడి వున్నాం. త్వరలో 'పల్లెసృజన' సంచిక సకాలం వెలువరించే ప్రయత్నంలో వున్నాం. మరో మూడు నెలల్లో దీన్ని సాధించాలనే లక్ష్యంతో సంపాదికవర్గం ముందుకు సాగుతోంది. మీ సహాయ, సహకారాలు మా కెంతో ప్రధానం, ధైర్యం కూడా.... శుభాకాంక్షలతో.....

భవదీయ

**'బ్రిగేడియర్' గణేశం**

# పల్లెల్లో జ్ఞానశోధన..... ఓ అద్భుత అనుభవం !



**తేజస్విని,** బిట్స్‌ఫిలాని విద్యార్థిని

జ్ఞాన సముపార్జనే ఒక నిరంతర ప్రయాణం. కానీ ఈ ప్రయాణం ఏ గ్రంథాలయాలకో, ప్రయోగశాలలకో కాదు.... ఎక్కడైతే దారిద్ర్యం, కొరత తాండవిస్తుందో అలాంటి గ్రామాలకు. "కొరత అనేది పరిశోధనకు మాతృక అంతేకాదు దారిద్ర్యం మనిషిని అసమర్థుడిని చేయలేదు" అన్న ఈ రెండు సూత్రాలమీద ఆధారపడి మా ప్రయాణం ముందుకు సాగింది.

**జూన్ 10, 2009 నాటికి మేము 14 మందిమి ఎన్.ఐ.టి. వరంగల్ చేరుకున్నాం. బ్రిగేడియర్ గణేశం గారి నుండి జాతీయ పరిశోధనా సంస్థ (ఎన్.ఐ.ఎఫ్.) మరియు హనీబీఏపి లతో మేము చేయవలసిన కార్యకలాపాలకు సంబంధించిన శిక్షణా తరగతులకు హాజరయ్యాము. గ్రామీణులనుండి సేకరించిన ఎన్నో ఇన్నోవేషన్లను వీడియోలో వీక్షించాం. అనంతరం.....**

మమ్మల్ని అయిదు గుంపులు విభజించి తొర్రూరు మండలం చుట్టుప్రక్కల గ్రామాలైన దుబ్బాడ తండా, హచ్చు తండ, చిట్యాల, చిన్న వంగర మరియు మేడిపల్లి గ్రామాలకు పంపడం జరిగింది. మేమీ గ్రామాల్లో మూడు రోజులు వారితో సహజీవనం సాగించి అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకోవాలి.



**దుబ్బతాండ:**

నేను, మీరజ్, పవన్ లను దుబ్బ తాండకు వెళ్ళగా అక్కడ ఒక గ్రంథాలయాధికారి గారి అబ్బాయి మణి మమ్మల్ని సాదరంగా ఆహ్వానించడం జరిగింది. మేమా గ్రంథాలయం లోనే మూడు రోజులు ఉండటం జరిగింది.

మొదటిరోజు మమ్మల్ని గ్రామస్థులు విదేశీయుల్లా, విచిత్రంగా చూశారు. మేమలా గ్రామంలో విహరించి అందర్నీ సంప్రదించడం, వారి వివరాలను సేకరించుకు రావడం, లైబ్రరీలో పేపర్లు చదవడం, పడుకోవడం – ఇదీ మా దినచర్య. మణి ద్వారా చాలామంది చిన్న పిల్లలతో స్నేహం ఏర్పడింది. మణి పదవ తరగతి వరకే చదివిన వాడైనా అపారమైన తెలివి తేటలున్నవాడు. కొందరు పట్టభద్రులకన్నా తెలివైన వాడని గ్రహించాం. ఇతని మాటకారితనం గురించి చెప్పాలంటే అనిల్ అంబానీని కూడా పది నిమిషాల్లో ఒప్పించే నేర్పు గలవాడు. వివిధ రకాల మొక్కలను సేకరించి వాటి ఉపయోగాలు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో మేం చిన్నపిల్లలకు ఒక చిన్న పోటీ ఏర్పాటు చేశాం. 90 ఏళ్ళ వయస్సున్న మణి తాత సోము గార్ని కలిశాం. ఆయన ఆ తాండాకి నెల్సన్ మండేలా లాంటివారు. నైజాం కాలంలోనే ఆయన 4వ తరగతి వరకు చదివారు. ఆయన నైజాం దురాగతాలకు వ్యతిరేకంగా పోరాడి 300 ఎకరాల భూమిని తన తోటి ఆదివాసులకు పట్టాలు చేయించాడు. ఈనాటికి తాండా అంతా అతడి త్యాగనిరతిని పొగడుతూ ఆయన్ను చాలా గౌరవంగా చూస్తారు. మేం ఆయనతో పాటు మరి కొందరు పెద్దల ద్వారా లంబాడాల సంస్కృతిని, జీవన విధానాన్ని తెలుసుకున్నాం.



వీళ్ళ పెళ్ళిల్లు ఆరు నెలల పాటు జరుగుతాయంటే విచిత్రంగా అనిపించింది. వీరి పద్ధతులు విచిత్రంగా నమ్మశక్యం కానివిగా వుంటాయి. పెళ్ళి కూతురి అన్న పెళ్ళి కొడుకుతో ఒక స్థలంలో 4 సార్లు పందెం కస్తాడట. మామగారు కూర్చో అనేంత వరకు పెళ్ళి కొడుకు నిలబడే ఉండాలట. చివరికి ఆరు నెలల తర్వాత పెళ్ళికూతుర్ని ఆవుపై అతనితో పంపుతారట. అమ్మాయిలూ ఇలాంటి ఆచారం అంతటా ఉంటే బావుంటుందనిపిస్తుంది కదూ!

తాండలో మా చివరి రోజైన జూన్ 13న మేం ఎలాంటి విలువైన సమాచారాన్ని సేకరించలేక పోయామని, అనుకున్నన్ని ఇన్నోవేషన్లను, ఆయుర్వేద మందులనైనా సంపాదించలేక పోయామే అని నిరుత్సాహ పడుతూ గడుపుతుండగా ఆ మధ్యాహ్నం మాకు వినయ్ కుమార్ అనే వ్యక్తి తారసపడ్డాతు. అతనా గ్రామంలో ఆల్ రౌండర్. ఏ పనైనా ఇట్టే చేయగల సమర్థుడు. అతనో టీచర్, వ్యాపార రంగంలో కూడా ఉన్నాడు (రియల్ ఎస్టేట్ వ్యాపారం, హోటల్ వ్యాపారం ఉన్నాయి), ఒక ఇన్నోవేటర్, ఆయుర్వేద వైద్యుడు మాత్రమే కాక యోగాలో కూడా మంచి ప్రవేశముంది. మేమతనితో రెండు గంటలు గడిపాము. ఆ రెండుగంటలూ అతనితో ఒక సినిమా చూసినంత ఆనందం కలిగింది మా దురదృష్టం కొద్దీ టేప్ రికార్డర్ తీసకు వెళ్ళలేదు అతని మాటలను టేప్ చేసుకోవడానికి అయినా అతని మాటల్లోని కొన్ని విషయాలను మీతో పంచుకుంటాను.

వినయ్ కుమార్ తాతగారు రాగిని బంగారంగా మార్చే విద్యను తెలుసుకోవాలని తన జీవితమంతా దానికి ధారపోశాడట. చివరికి విజయం సాధించాడు. కానీ, ఆ రహస్యాన్ని ఇతరులకి చెప్పకుండానే కన్ను మూశారు. ఇతను ఆ రహస్యాన్ని తెలుసుకోవాలనే తపనతో తన తాతగారు రాసిన పుస్తకాలు చదవటం మొదలు పెట్టాడు. అతని రాత ఒక పేజీ చదవటానికి 25 రోజులు పట్టిందట వినయ్ కుమార్ కి. ఆ పుస్తకంలో శతాబ్దాల ముందటి ఆయుర్వేద చికిత్సలు, ప్రత్యేకించి గుండెపోటు వచ్చిన వ్యక్తికి ఇచ్చే వైద్యం గురించి కూడా చెప్పాడతను.

గుండెపోటు వచ్చిన వ్యక్తిని మండే ఎండలో కూర్చోబెట్టాలి. రెండు నిమ్మకాయలను తీసుకుని వాటిలో రసం తీసి వాటిలో గుండెపోటు వచ్చిన వ్యక్తి ఎత్తును బట్టి తగినంత పాదరసం (మెర్క్యురీ) ఇంజక్షన్ ద్వారా ఆ నిమ్మకాయలోకి ఎక్కించి రోగి ఎదురుగా పెడితే అవి రోగి ఎదురుగా పెడితే అవి అతని గుండెనొప్పి తగ్గేంత వరకు అతని హృదయంమీద నాట్యం చేస్తాయట!

మండుటెండలో వేడికి పాదరసం త్వరగా ఆవిరై నిమ్మకాయలు ఎగిరేట్టు చేయటం వరకు వాస్తవమే, కాని గుండెపోటును తగ్గిస్తాయి అనేది ఎంతవరకు నిజం అనేది అర్థంకాని అనుమానంగానే మిగిలిపోయింది.

విషం తీసుకున్నవ్యక్తి నాలుకపై కొద్దిగా 'ఇంగాలికం పౌడర్' వేసినట్లయితే కడుపులో ఉన్నదంతా వెలువలికి వచ్చేసి ఆ వ్యక్తిని ప్రమాదం నుండి కాపాడుతుంది.

అతను ఇలా లెక్కలేనన్ని నాటు వైద్య చిట్కాలు అనేకం చెప్పాడు. అతను ఈ వైద్య మూలికలు, అవి తెలిసిన సాధువులు శ్రీశైలం అడవుల్లో ఇప్పటికీ ఉన్నారంటాడు. మాకతను ఒక విచిత్రమైన తీగ "తిప్పుడు తీగ" గురించి చెబుతూ అది మన కళ్ళకి తగిలితే మనం ఒళ్ళు తెలీకుండా అడవిలో 15 రోజులు తిరుగుతూనే ఉంటామట. ఇంకో విషయం చెప్పాడు. ఆత్మతో మాట్లాడతానంటే మాట్లాడిస్తాను. మీరు సిద్ధమేనా అన్నాడు. మావద్ద సమాధానం లేదు. అంతేకాదు మాలో వణుకు పుట్టింది. ఆ భయం తగ్గడానికి

## ఇలా మొదలైంది ఈ ప్రయాణం.....

నేను బిట్స్‌ఫిలానీలో బి.టెక్ 3వ సంవత్సరం చదువుతున్నాను. నేను మొదటి సంవత్సరం చేస్తున్నప్పటినుంచి నా చదువుకు, నా భవిష్యత్తుకు సంబంధించే ఏదో ఒక శిక్షణ లాంటిది చేయాలన్న తపన. కాబట్టి నేను అనుకున్నట్టుగానే ప్రతిష్ఠాత్మకమైన ఐ.ఐ.ఎస్.సి., ఇ4ఎస్ఐ, ఐఎస్‌బి, ఐఐఐటి, ఐఐఎమ్ఏ లాంటి సంస్థలకు, కొత్త కంపెనీలకు దరఖాస్తు చేశాను. ఎక్కడినుంచి కూడా నాకు అనుకూలమైన సమాధానం రాక నేను చాలా నిరుత్సాహపడ్డాను. ఆశ్చర్యంగా అదే రాత్రి రెండు మెయిల్స్ వచ్చాయి వాటిలో ఒకటి అనిల్ గుప్తా గారి (ఎన్ఐఐటి) నుంచి, ఆంధ్రప్రదేశ్‌లోని పల్లెల్లో వున్న అట్టడుగు స్థాయి పరిశోధకుల గూర్చిన సామాజిక విషయ సేకరణ చేయమని సూచిస్తూ, ఇందులో నా మిత్రులను కూడా భాగస్వాములను చేయవచ్చు అని తెలిపారు. మరోటి 'డెయిలీ డంప్' సంస్థ నుండి నెలకు 6 వేల రూపాయల స్టయిఫండ్ ఇస్తామని, వారి ఉత్పత్తులను సమీప గ్రామాల్లో అమ్మేలా చూడాలని.

ఇక నిర్ణయించకోవాల్సింది నేను....

నా మిత్రులు, నా మనస్సు చెప్పింది తేజూ ఇప్పటివరకు నీవు చేసిన సమాజ సేవ చాలు. ఇక నీ భవిష్యత్తుమీద దృష్టి పెట్టు అని. నా హృదయం మాత్రం నిజమైన భారతీయ సంస్కృతి ఏ పల్లెల్లో అయితే వుందో అక్కడే క్షేత్రస్థాయి పరిశోధనలకు ప్రాచుర్యం కల్పిస్తే నిజమైన తృప్తి వుంటుందని. నా మిత్రులు కూడా నాతో సహకరించడానికి, గ్రామీణులతో సన్నిహితంగా మెలుగుతూ వారిని అర్థం చేసుకొని, వారితో సహజీవనం చేయడం అలవర్చుకున్నాం.


నా మిత్రుడు ఆకాష్ (ప్రెసిడెంట్, నిర్మాణ్), బాలా ఫణిచంద్ నా ఆలోచనకు అభినందించి ప్రోత్సహించారు. ఏదో ఒకరకంగా నా సన్నిహితులను, జూనియర్లను 13 మందిని ఇందుకు ఒప్పించాను. మా నాన్నకు నేను ఒంటరిగా వెళ్ళటం ఇష్టం లేకపోయినా, ప్రతిపాదించింది నేను కాబట్టి నేనే ప్రారంభించాలి అని ముందురోజు ఇంటర్ చదివే నా స్నేహితురాలు మీరజ్‌ను కలిసి ఈ శిక్షణ గూర్చి చెప్పాను. ఆమెకూడా నాతో కలవడానికి సమ్మతి తెలియజేసింది. ఆ విధంగా ప్రారంభమైంది మా ప్రస్థానం.......... **తేజస్విని**

కాస్త సమయం పట్టింది. ఇదంతా పూర్తిగా మూఢనమ్మకం అన్పిస్తుంది. మాకూ నమ్మాలనిపించలేదు.

అతను ప్రతి వ్యక్తి చుట్టూ ఒక కాంతి (ఆరా) ఉంటుందని, దాని ద్వారా ఆ మనిషి తత్వం తెలుసుకోవచ్చనీ చెపుతూ మా సహచరుడు 'పవన్'ని స్నానం చేసివచ్చి కొంతసేపు ధ్యానం చేసి కూర్చుంటే అతని భవిష్యత్తు కూడా చెబుతా అన్నాడు. పాపం పవన్ తనకలాంటి ఆలోచన లేదని తప్పుకున్నాడు. అతను ఒక రకమైన కాటుక కళ్ళకి పెట్టుకుంటే భూమిలో మనిషి భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్ని చూడవచ్చుంటాడు. ఇలాగే ఒక వ్యక్తి భూమిలో వున్న నిధిని కనిపెట్టానని చెప్పాడు. మేం ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే వినయ్ కుమార్ పురావస్తు శాఖకై పనిచేస్తూ వుంటాడు. మేం అతని వద్దనుంచి సెలవు తీసుకునే ముందు అతని ఫోన్ నెంబర్ ఒక పుస్తకంలో రాసుకున్నాం. అది చూసి అతను ఆ పుస్తకం గమ్యం చేరదు అన్నాడు. మాకర్థం కాలేదు. ఆశ్చర్యంగా వెళ్ళిపోబోయాం. నన్ను వెనక్కు పిలిచి నా కంటి అద్దాలను చూసి నీ దృష్టిదోషం నెంబరు 6.5 అని అడిగాడు కాదు 8 అని చెప్పాను. దానికతను ఏదో వనమూలికలు మందులుగా చెప్పాడు. మీరజ్ మరియు పవన్ లావు కావడానికి బోలెడన్ని సలహాలిచ్చాడు.

అప్పుడు మా మనస్సులో ఏంవుందో తెలీదు. కానీ, శ్రీశైలం అడవులకి ఒక్కసారైనా వెళ్ళాలన్న ఉత్సాహం కలిగింది. ఆ విధంగా మా సంభాషణ మొత్తం తెలుగు భాషలోని ఒక ప్రముఖ కావ్య వివరణ, ఒక పాతాళ భైరవి సినిమా, గత సంవత్సరాల్లో విడుదలైన చలనచిత్రం; ఏది నమ్మాలో.... ఏది నమ్మకూడదో తెలియని డోలాయమాన స్థితి మాది.






జూన్ 13వ తేదీన మేమందరం వరంగల్ లోని ఎన్.ఐ.టి.కి తిరిగి చేరుకుని మా అనుభవాలను పంచుకున్నాం. మేమందరం కూడా దాదాపు ఒకేవిధమైన తమాషాతో కూడిన గూఢమైన అనుభవాలను చవిచూచాము. మరునాడు అక్కడి జ్ఞానం, సహజ వనరుల గురించి, సౌందర్యాల పట్ల మా అనుభవాల గురించి నిశితంగా బ్రిగేడియర్ గణేశం గారితో చర్చ సాగింది.

15వ తేది ఉదయం మా యాత్ర 'ములుగు' పరిసర ప్రాంత గ్రామాలైన 'కమలాపురం, బుస్సాపురం, జంగాలపల్లి మరియు కాశిందేవ్‌పేట'లలో కొనసాగింది. అందులో మాకు కేటాయించింది వరంగల్లు నుండి సుదూర ప్రాంతంలో వున్న కమలాపురం ఏజన్సీ ప్రాంతం. మాకు జయలక్ష్మి అనే ఒక మహిళ ఇంట్లో ఆతిథ్యం ఏర్పాటు చేశారు. ఆవిడను మేము కమలాపురం మదర్ థెరిస్సాగా పిలిచేవాళ్ళం. ఆమె 'శక్తి సేవా సొసైటి' అనే పేరుతో ఒక 'నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్' (ఎన్.జి.ఓ.) అనగా ప్రభుత్వేతర సంస్థను నడిపేది. దీని ప్రధాన వ్యాపకం మహిళా సాధికారత సాధించడం, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం. ఈ సంస్థ కమలాపురం పరిసర ప్రాంతాలలోని 20 గ్రామాలలో దత్తత తీసుకొని 30 ఎస్.హెచ్.జి.లలో ప్రారంభించింది. ఈ సంస్థ చాలావరకు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించ గలిగింది. వివిధ రకాల సామాజిక కార్యక్రమాలను రూపొందించి, వాటిని సమర్థవంతంగా సమన్వయ పరుస్తూ నిర్వహించడం ద్వారా ఆ ప్రాంతంలో నిరుద్యోగ సమస్యను చాలావరకు తగ్గించి దారిద్రాన్ని పారద్రోలగలిగింది. తన కాళ్ళమీద తాను నిలబడాలని, తమ గ్రామంలోని ఆదివాసీల దీనాతి దీనమైన జీవన స్థితిగతులను మెరుగు పరచాలనే ఉద్దేశ్యంతో ఈ ఎన్.జి.ఓ.ను స్థాపించింది. శ్రీమతి జయలక్ష్మి గారు పరోపకారార్థం, నిస్వార్థంగా గ్రామీణ సమాజం లోని ప్రజల పట్ల కనికర భావంతో సేవలు అందించాలనే తపన కల్గిన మహిళ. పాఠశాల



చదువులు మధ్యలోనే ఆగిపోయిన చిన్నారులకు నాణ్యతతో కూడిన చదువు అందించాలని ఆ చిన్నారులలో చక్కని ప్రవర్తన, సద్బుద్ధి కలిగించాలనే సంకల్పంతో ఒక వారధి లాంటి సంస్థను నెలకొల్పింది.

సరే, మన సాహస కృత్యాల విషయానికి వద్దాం. మేము సందర్శించాల్సిన ప్రాంతాలు కమలాపురానికి చాలా దూరంగా ఉండటంతో జయలక్ష్మిగారు తన బండిని ఇచ్చింది. దానిమీద నేను, మిరాజ్ ప్రయాణం చేశాము. (గతంలో నేను ఎప్పుడూ బండి నడపలేదు అలాంటి నేను ప్రధాన రహదారిపై సుమారు 40 నుండి 60 కి.మీ. వేగంతో వెనుక మరొకరిని ఎక్కించుకొని నడపడం అనేది నాకు ఒక చక్కని దివ్యానుభూతి. కాని నేను మెల్లగా భయాన్ని వదిలేసి ఇది ఒక పెద్ద సాహస చర్య కాదు నువ్వు సునాయాసంగా చేయగలవు అని నాకు నేను ధైర్యం చెప్పుకుంటూ ప్రగాఢ విశ్వాసంతో ముందుకు సాగాను). మాతో భాస్కర్ గారు వచ్చారు. (అతని బండిమీద వెనుక పవన్ ఎక్కాడు). భాస్కర్ ఎన్.ఎస్.ఎస్. ఉద్యోగి. మొట్టమొదటిగా మేము చేరుకుంది కమలాపురానికి 15 కి.మీ. దూరంలో వున్న తొండియాల గ్రామం. ఇది కోయలుగా పిలువబడే ట్రైబల్ తెగకు చెందిన ఆదివాసీలకు ఆవాసం. ఇక్కడ ఇటుకలు, సిమెంటుతో కట్టిన ఒక్క ఇల్లుకూడా మనకు కనపడదు. బురద, చెక్కలతో తయారు చేసిన పైకప్పుతో ఉన్న ఇళ్ళు మాత్రమే మనకు కనిపిస్తాయి. ఇక్కడ 'కాంతయ్య' అనే ఒక ట్రైబల్ జాతి వ్యక్తిని కలిశాం. ఈరోజు వరకు కూడా షెడ్యూల్ తెగకు చెందినవారిలో గ్రాడ్యు-షన్ పూర్తి చేసిన వారిని ఏ కొద్దిమందిని



మాత్రమే చూశాం. మన పరిసరాలలో పాఠశాలలు లేని ఆనాటి నైజాం సామ్రాజ్యంలో అరుదుగా మెట్రిక్యులేషన్ పూర్తి చేయడంతో శ్రీ కాంతయ్య నిబద్ధత, పట్టుదల వ్యక్తమవుతాయి. అతను చక్కని గ్రహణశక్తి కలవాడు. వారు అనుసరిస్తున్న సంస్కృతి, నాగరికత, వారు చేస్తున్న సాంప్రదాయక వ్యవసాయ పద్ధతులను గూర్చి వివరంగా విశదీకరించారు. మేము 20లో ఉన్నప్పటికీ మాలోని ధైర్యం బెరుకుదనాన్ని అధిగమించేది కాని, ఈ 90 సంవత్సరాల యువకుడు ఒక చిన్న పిల్లాడిలా త్వరితగతిని తిరుగుతూ అతని చిన్నతనం జ్ఞాపకాలను ప్రకృతి సహజమైన విశేషాలను విశదీకరించే ఆయన బహుముఖ ప్రజ్ఞకు నిశ్చేష్టులమయ్యాము. మాకు అంబలి, సంకటి ఎలా తయారు చేస్తారో నేర్పాడు. అలాగే యంత్రాలు లేకుండా మనుషులే తయారు చేసే చమురు (నూనె) ఎలా తయారు చేస్తారో ప్రత్యక్షంగా చేసి చూపించారు. అతనొక చక్కని సునిశితమైన వ్యాఖ్యాత. అతని నిండైన విషయ పరిజ్ఞానం ఎంతో ప్రభావితం చేసేది. నీవు ఏదైనా కార్యం తలపెట్టినపుడు ఎవరో పిల్లలు చెప్పినదానిని బట్టే కాక, వారి అభిప్రాయాలను, ఇతరుల ఆలోచనలను తీసుకొని సమీక్షించి, నిర్ధారించుకొని ముందుకు సాగాలి అంటారు కాంతయ్యగారు. ఈయన ఒక మహోన్నత వ్యక్తి.

**మల్లూరిగుట్ట :**

మా తరువాతి మజిలీ కొండమీద వున్న 'మల్లూరిగుట్ట' గ్రామం తిరుమలకు బండిమీద వెళ్ళాలి అనేది నా చిరకాల కోరిక. కాని అది ఈ మల్లూరి గుట్టకు బైక్‌మీద వెళ్ళడంతో పాక్షికంగా నెరవేరింది. ఈ గ్రామం దట్టమైన అడవిలో వుంది. ఇక్కడ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నెలకొని వుంది. ఈ గుడి వెనుక గాథను ఆలయ పూజారి వివరించారు. క్రీ.శ. 200 సంవత్సరంలో దిలీప్‌కర్ణ అనే రాజుకు లక్ష్మీ నరసింహ స్వామి కలలో కనిపించి తనకు అక్కడ ఒక గుడి కట్టమని కోరినట్లుగా క్షేత్ర పురాణం చెబుతోందని పూజారి పేర్కొన్నారు. ఇతర దేవతలు అవతారాలు ఎత్తడం వెనుక కల పురాణ గాథలెన్నింటినో తెలియజెప్పాడు.

పచ్చని తివాచి పరచినట్లున్న అక్కడి అడవులలో ఆసక్తిగా కలియదిరిగి చూడటం ఒక దివ్యానుభూతి. వివిధ రకాల వృక్షాలతో, కొమ్మలతో, మహావృక్షాల మొదళ్ళతో సూర్యకిరణాలను సైతం చొరబడనీయని ఒక కీకారణ్యం అది. మేము చూచిన ఒక చెట్టు కాండం చుట్టుకొలత 8 మీటర్లు అంటే ఆశ్చర్యమే మరి. అక్కడ 'చింతామణి' అనే పేరుతో ఒక చిన్న సెలయేరు (కాలువ) ప్రవహిస్తోంది. వివిధ మూలికా ఔషధ మొక్కలకు ఆలవాలమైన ఆ కొండ ప్రాంతాల నుండి ఆ ఔషధ మొక్కల మీదుగా ప్రవహిస్తూ ఉండటంతో ఈ నీటికి ఔషధ విలువలు ఎక్కువ. ఈ విషయాలన్నింటిని ప్రక్కన పెడితే ఈ నీరు ఒక్కసారి రుచి చూస్తే వదిలిపెట్టబుద్ధి కాదు. జీవితాన్ని పొడిగించే అమృతంతో సమానంగా పేర్కొంటారు ఈ నీటిని.

తిరిగి వచ్చేటప్పుడు మేమెంతో సంతోషించాం. ఇలాంటి కోర్సు, శిక్షణ, యాత్రలు ప్రతి విద్యార్థికి తప్పనిసరి అన్పించింది. ఈ ఉద్యోగాలు కేవలం ఒక యాంత్రికంగా కాక దివ్యానుభూతిగా ఉంటే బాగుండనిపించింది. కేవలం ఒక జర్నలిస్టుగా కాక ఒక పరిపూర్ణ వ్యక్తిగా ఉంటే బాగుండు అన్పించింది. ఒక విద్యావంతుడిగా కాక పరిపూర్ణ విజ్ఞానవంతుడిగా ఉంటే బాగుండనిపించింది. ప్రాచీన భారతీయ సంస్కృతి తిరోగమనంలో పయనిస్తూ దేశం ఎదుర్కొంటున్న దురవస్థ, దీనస్థితి పట్ల అప్రమత్తంగా ఉండాలి అనేది అనుభవ పూర్వకంగా నేర్చుకున్నాం. మీరజ్ ఈ విషయాలంతా మాట్లాడుతూ స్పీడోమీటర్ చూచి ఓ! మనం గంటకు 60-70 కి.మీ. వేగంతో ప్రయాణిస్తున్నాం అన్నది. యువకులకు గంటకు 120 కి.మీ. వేగంతో ప్రయాణించడం ఉద్వేగంగా ఉంటే నాకు 60 కి.మీ. వేగంతో ప్రయాణించడమే ఒక గొప్ప ఘనకార్యంగా భావించాను.

ఆ సాయంత్రం మాకు ఎప్పటికి గుర్తుండిపోయేలా అయ్యింది. అనంతరం కమలాపురానికి 5 కి.మీ. దూరంలోని కారడవిలో ఉన్న రేగుగడ్డ గ్రామానికి వెళ్ళాం. ఈ గ్రామానికి సరైన రహదారి లేదు. ఒక తెలియని కొత్త ప్రాంతాన్ని కనుగొన్న అనుభూతి కలిగింది. ఈ యాత్రకు సంబంధించి నా మిత్రుడు చెప్పిన అందమైన ఓ పద్యంలోని పాదాలు గుర్తుకొచ్చాయి.



*భానుతేజుడు భగ్గుమంటున్న,*
*కారు మేఘాలు కమ్ముకొస్తున్న,*
*కటిక చీకటి అలుమొంటున్న,*
*కాలసర్పాలు తిరుగుతుంటున్న,*
*కారు అడవిలో సాగిన*
*ఈ సాహస యాత్ర వేసింది*
*ఈ జీవితానికి ఓ చెరగని ముద్ర.....*

ఇది ఒక ఉన్నతమైన అర్థాన్నిచ్చే గేయం. ఇది నా రచన కాదు. సరే! మన సాహస యాత్ర కొనసాగిద్దాం...

మేము హీరో హోండా మరియు హోండిసిటీ బైక్‌లమీద ప్రయాణం చేశాం. దురదృష్టవశాత్తు సగానికి సగం సమయం బండ్లను ఇసుకలో నెట్టడంతోనే సరిపోయింది. అది చాలా ఇరుకైన రోడ్డు.

**రేగులగడ్డ :**

ఎట్టకేలకు అతి కష్టంమీద మా గమ్యస్థానం రేగులగడ్డ చేరుకున్నాం. ఇది కేవలం 38 కుటుంబాలు నివాసముంటున్న చిన్న కుగ్రామం. మా అసంపూర్ణ అనుభవాలను నెమరు వేసుకొంటున్న తరుణంలోనే వర్షం మొదలైంది. మా కష్టాలకు తోడుగా ఆ గ్రామంలో కరెంటు కూడా లేదని తెల్సుకొని భవంతుడా! మేము ఈ ఊరినుండి ఎలా బయట పడగలం అని భయపడిపోయాం. కాని, వెంటనే మా ఈ ఐచ్ఛిక వేదనలకు, భౌతిక సుఖాలను మర్చిపోయి పనిలో నిమగ్నమై అక్కడి జనంతో సమావేశమై వారి సంస్కృతి, సాంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, జీవనాధారం మరియు వైద్య విధానం మొదలగు వాటిని గూర్చి చర్చించసాగాం.

వీరు అధికశాతం వేటాడటంపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఆహారపు వంటలు వండించుకోవడానికి వీరికి ప్రభుత్వంవారు 170 ఎకంంల భూమిని పంచారు. కాని, వారికి సరిగా వ్యవసాయం చేయడం కూడా తెలియదు. అక్కడ ఒక చిన్న ప్రభుత్వ పాఠశాల అలాగే శ్రీమతి జయలక్ష్మిగారు తాను స్వంతంగా వేయించిన ఒక బోరుబావి ఉన్నాయి. ఆ రాత్రి మాకు అక్కడే విందు ఏర్పాటు చేయడానికి వారి వంటకాలు రుచి చూపించటానికి ప్రత్యేకించి అడవి పంది కూర వండి పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మాట వినటంతోనే నా తల తిరగసాగింది. వారి ఆతిథ్యం, ఆప్యాయత, అనురాగాలతో కూడుకున్నది అయినప్పటికి మేము సున్నితంగా తిరస్కరించాం.

ఇక్కడి ప్రజలంతా చాలా పూర్వీకుల్లాగ, అమాయకులుగా, ఆది మానవులను గుర్తు చేస్తున్నట్లు ఉంటారు. ఇక్కడి స్త్రీలు లుంగీ, రవిక ధరిస్తారు. కనీస వైద్య సౌకర్యాలు కూడా వీరికి లేవు. ఇద్దరు చిన్నారులను పాముకాటు వేస్తే అక్కడ తగిన వైద్య సదుపాయాలు లేక ఆ చిన్నారులను పోగొట్టుకోవాల్సి వచ్చింది. వారిని సమీప పట్టణాలకు వస్తే కనీస సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వాలు చెప్పినా వారు ఆయా గ్రామాలను వదిలి రారు.

వర్షం కాస్త తగ్గుముఖం పట్టడంతో తిరు ప్రయాణాన్ని మొదలెట్టాం. అలా ఆసక్తికరమైన కార్యకలాపాలతో నిమగ్నమయ్యాం. అయితే ఈసారి అది చీకటిలో ఆ చీకటిలో మేము ఒక పాముమీదనుండి దాటుకొని వచ్చినా మాకు తెలియలేదు. ఏమైనప్పటికీ మా యాత్ర నుండి మేము క్షేమంగా తిరిగి రావడంతో ఒక సాహస యాత్రగా విజయవంతం అయ్యింది. సంతృప్తినిచ్చింది. దిశా నిర్దేశం లేకుండా పూనుకున్న మా సాహస యాత్ర మా కలలకు కొంతవరకు సహకారం చేసిందనే చెప్పవచ్చు.






# ఊహాలు గాలిపటాలైతే....?

**కొత్త శ్రీనివాస్**

## క్లిష్ట జీవనయాత్ర.....

**జీవనాధారం వెతుక్కుంటూ సికింద్రాబాద్ ప్రయాణం....**
**పదవ తరగతి వరకు అతి కష్టంపై చదువు కొనసాగింపు....**
**కానీ.... ఊహల గాలిపటాలను ఎగురవేస్తూ గాలిపటాలే జీవనాధారం చేసుకున్న ఓ యువకుడి కథ!**

చాలామందిలో ఒకడిగా.... అతి సామాన్యమైన పేద రైతుకూలీ కుటుంబం నుండి వచ్చాడు శ్రీనివాస్. అమ్మ, నాన్న 35 సంవత్సరాల క్రితం జీవనాధారం కొరకు సికింద్రాబాద్ వచ్చారు. ఇక్కడ దగ్గరలోని మోండా మార్కెట్‌లో టిఫిన్ బండి నడిపిస్తూ జీవనం కొనసాగించారు. అతను చిన్నప్పుడు పార్క్‌లేన్ స్కూల్‌లో 7వ తరగతి వరకు చదివాడు. 8 నుండి 10వ తరగతి వరకు నల్లగుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాడు.

శ్రీనివాసులు 6వ తరగతిలో ఉన్నపుడు కుటుంబ ఆర్థిక పరిస్థితులు దయనీయంగా వుండేవి. అందుచేత 10వ తరగతి మధ్యలోనే ఆపివేయవలసి వచ్చింది. అతని ఆర్థిక పరిస్థితి ఎంతటి దయనీయమైనదంటే ఏడవ తరగతిలో పాఠ్య పుస్తకాలు కొనేందుకు డబ్బులు లేక తన మిత్రుల ద్వారా వారి షాపునుండి రెండు నోటు పుస్తకాలు ఇస్తే వాటిలో వ్రాసుకున్నాడు. 5వ తరగతిలో చొక్కాకు గుడ్డ కొన్న తర్వాత వాటిని కుట్టించుకునేందుకు మూడు రూపాయలు లేక పక్కింటి వారు సహాయం చేస్తే ఆ డబ్బుతో చొక్కా కుట్టించుకున్నాడు. ఆ సహాయాన్ని నేను జీవితాంతం మర్చిపోలేను అంటాడు శ్రీనివాసులు.



కొత్త శ్రీనివాస్ అశోక్

అతని తొమ్మిదో తరగతిలో వృత్తి విద్యా కోర్సులను ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగింది. అందులో అతనికి ఎలక్ట్రికల్ సబ్జెక్ట్ ఇచ్చారు. కానీ ఇతనికి ఎలక్ట్రానిక్స్ పై మక్కువ ఎక్కువ. అతని తొమ్మిదో తరగతిలో వృత్తి విద్యాకోర్సుల అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహించారు. అందులో శ్రీనివాస్ చేసిన ప్రాజెక్టుకు మొదటి బహుమతి వచ్చింది. కానీ ఆ బహుమతి అందుకున్న ఫొటో కొనడానికి అతని వద్ద 10 రూపాయలు లేక ఒక కిలోమీటర్ దూరంలోవున్న ఒక జిరాక్స్ షాప్‌లో ఫొటోను జిరాక్స్ తీసుకున్నాడు. ఈ







కార్యక్రమానికి గాలి ముద్దు కృష్ణమ నాయుడు ముఖ్య అతిథిగా వచ్చారు.

శ్రీనివాస్ విద్యాభ్యాసం 10వ తరగతి మధ్యలోనే ఆగిపోయింది. తనకు అతి ఇష్టమైన ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ & మెకానిక్స్ సబ్జక్టులలో ఎదుదామన్న ఆశలు అలాగే మధ్యలో ఆగిపోయాయి. తరువాత ఒక సంవత్సరం అల్యూమినియం ఫ్యాబ్రికేటర్ వద్ద, మరో రెండు సంవత్సరాలు కార్పెంటర్ వద్ద పని చేయడం జరిగింది. కాని తనకు అతి ప్రియమైన ఎలక్ట్రికల్స్ & ఎలక్ట్రానిక్స్ మదిలో ఎప్పుడూ మెదులుతూ ఆలోచనలు వస్తూ వుండేవి. వాటిపై వున్న ఇష్టంతో అతను కొన్ని ఎలక్ట్రానిక్స్ కు సంబంధించిన పుస్తకాలు చదువుతూ వైరింగ్ మరియు రిపేర్లు చేయడం మొదలు పెట్టాడు. తన పక్కింటి వారివి మొదట్లో రిపేరు చేసేవాడు అతని పని అందరికి నచ్చింది అలా.... అలా మంచి పేరుగాంచిన టి.వి. మరియు రేడియో మెకానిక్‌గా తన జీవన విధానాన్ని మార్చుకున్నాడు.

ఇప్పుడు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులైనా చాలావరకు రిపేరు చేయగలడు. గత పది సంవత్సరాలుగా ఒక ఎలక్ట్రానిక్స షాప్ నడిపిస్తున్నాడు. తనకు ఇష్టమైన విద్యాభ్యాసం మధ్యలో ఆగిపోయినందుకు ఎప్పుడూ బాధపడుతూ వుండేవాడు. తన తోటి విద్యార్థులు ఉన్నత స్థితిలో వుండి తనకు ఎప్పుడైనా కనిపిస్తే ఆ బాధ ఇంకా ఎక్కువయ్యేది. కానీ జీవితం నుండి ఎన్నో పాఠాలు నేర్చుకున్నాడు. నాలాంటి విద్యార్థులు మన వ్యవస్థలో ఎందరో వున్నారు. వారి కొరకు ఏదైనా చేయాలి అని గత 5 సంవత్సరాలుగా తన బస్తీకి చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 180 మంది విద్యార్థులకు ఉచితంగా యూనిఫారం, 180 మంది వాద్యార్థులకు సరిపడ నోటు పుస్తకాలను తనకు తెలిసిన పెద్దలనుండి సేకరించి ఇవ్వడం ఎంతో అభినందనీయం.

**శ్రీనివాస్ ఆశలు, ఆశయాలు, వాటి ఫలితాలు :**

✤ చిన్నప్పుడు బ్యాటరీ లైట్లతో ఆడుకోవడం చాలా ఇష్టం.

✤ గాలి పటాలు తయారు చేసి ఎగురవేయడం అంటే మహా ఇష్టం. ఆ ఇష్టాన్ని పెంచుకుని 7 సంవత్సరాల క్రితం గాలి పటాల పోటీలో 12 అడుగుల పెద్ద గాలిపటం తయారు చేయడం జరిగింది. ఇది గుడ్డ, ఎలక్ట్రికల్ పివిసి పైపులతో తయారు చేసి ఎగురవేయడం జరిగింది. శిల్పారామంలో నేషనల్ లెవెల్ గాలిపటాల పోటీలలో మొదటి బహుమతి అందుకున్నాడు. ఆ తరువాత 2003లో తన స్నేహితుడు అశోక్‌తో కలిసి 'కోహినూర్ కైట్ క్లబ్' ఆరంభించాడు. ఆ తర్వాత 3 నేషనల్, 5 ఇంటర్‌నేషనల్ పోటీలలో పాల్గొన్నాడు. వీరు తయారు చేసిన గాలిపటాలు చాలా విభిన్నంగా ఉంటాయి.

✤ నిమ్మకాయంత సిరిస్‌లో వైర్లు బిగించి, చిన్న 'లెడ్' (ఎల్.ఇ.డి.) తయారు చేసి వెలిగించాడు. పది సంవత్సరాల క్రితం నిమ్మకాయంత చిన్న ఎల్.ఇ.డి. రిస్ట్ వాచ్ తయారు చేసి నడిపించారు.

✤ సోలార్ పవర్ మరియు బ్యాటరీతో నడిచే రిక్షా ఒకటి తయారు చేశాడు.

✤ ముసలి వారికి ఉపయోగపడే 'లెడ్' చేతికర్రను తయారు చేశారు.

✤ మొక్కలకు నీరు చిమ్మే తిరుగుతూ వుండే ఫౌంటెయిన్ తయారు చేశారు. దీనికి మోటారు కానీ, విద్యుత్ కానీ అవసరం లేదు.

✤ హీరో హెూండా మోటార్ సైకిల్‌కు సెల్‌ఫోన్ ఛార్జర్‌ను ఏర్పాటు చేశాడు.

✤ సముద్రపు అలలతో విద్యుత్‌ను మరియు మంచినీటిని తయారు చేసే కార్యక్రమం ప్రయోగ దశలో ఉంది. ఈ ప్రయోగానికి సహాయ సహకారాలకై ఎదురు చూస్తున్నాడు. హనీబీఏపి ద్వారా, ఎన్.ఐ.ఎఫ్. సహాయాన్ని కోరాడు.

ప్రస్తుతం శ్రీనివాస్ అంబేద్కర్ ఓపన్ యూనివర్శిటీలో బి.యస్‌సి రెండవ సంవత్సరం చదువుతున్నాడు. కొంత సమయాన్ని తన ఆశయ సాధన కోసం వెచ్చిస్తున్న శ్రీనివాస్ లాంటి వారికి 'హనీబీఏపి' సహకారాలనెప్పుడూ అందిస్తుంది.

**మట్టిలో మాణిక్యాలంటే శ్రీనివాస్ లాంటి వాళ్ళే కదూ!**

## సామాన్యుడి 'అసామాన్య ఆలోచన'

# సులభమైన టీ మేకర్



హర్యానాకు చెందిన ఫిరోజ్‌పూర్ వాస్తవ్యుడు అశోక్ కుమార్ థిమాన్‌కు బాల్యం నుంచే శాస్త్ర విజ్ఞానం (సైన్స్) పట్ల ఎంతో ఆసక్తి ఉండేది. తాను 6వ తరగతి చదువుతున్నప్పుడే 35 మి.మీ. ఫొటో ఫిలింలో ఇప్పుడు మనం పొందుతున్న 36 సాధారణ ఫొటోలకన్నా 44 ఫొటోలను తీయగల విధానాన్ని రూపొందించాడు. 10వ తరగతి చదువుతున్న సమయంలో మనందరం గర్వపడే రీతిలో బైనాక్యులర్స్ తయారు చేశాడు. అదే సమయంలో నంబర్ల ఆధారంగా పనిచేసే తాళాన్ని, ఆటోమేటిక్ కర్ఫ్యూ సైరన్‌ను రూపొందించాడు. 10వ తరగతి అనంతరం ఐటిఐ శిక్షణలో చేరాడు.

అశోక్ కుమార్ తల్లి అనారోగ్యంతో ఉండటంతో తనకు తరచుగా అతడు టీ తయారు చేయాల్సి వచ్చేది. ఈ వ్యవహారమంతా చిరాకు కలిగించేది. తన ఇంట్లో గ్యాస్‌స్టవ్ గానీ, కిరోసిన్ స్టౌ గానీ లేకపోవడమే ఇందుకు కారణం. అందువల్ల తాను టీ తయారు చేయాల్సి వచ్చిన ప్రతిసారీ సంప్రదాయంగా ఉపయోగించే కట్టెల పొయ్యిలో కట్టెలు మండించాల్సి వచ్చేది. ఇక తరువాత వంట చేయాల్సింది ఏమీ లేకపోవడంతో అప్పటికే మండిన కట్టెలన్నీ వృధా అయ్యేవి. ఈ సమస్యతో విసుగు చెందిన అశోక్ విద్యుత్ ఆధారంగా పనిచేయగల ఒక పొయ్యిని తయారు చేయాలనే ఆలోచనకు వచ్చాడు. సాధారణ విద్యుత్ పొయ్యికి ఎక్కువ విద్యుత్ అవసరమవుతుండటంతో దానిని ఉపయోగించకుండా ఒక సృజనాత్మకమైన పరిశోధన కోసం ఆలోచించ సాగాడు. ఒక చిన్న విద్యుత్ పొయ్యి తయారు చేయడానికి నాలుగు నెలల కాలం పట్టింది. ప్రారంభ దశలో రూపొందించిన చిన్న పొయ్యికి దాదాపు 8 వేల రూపాయలు ఖర్చయ్యేది. ఈ పొయ్యి డిజైన్ కొన్ని మార్పులు చేసి, సరిచేయడంతో దాని వ్యయం రూ. 3 వేలకు తగ్గించ గలిగాడు.

**సరికొత్త ఆవిష్కరణ:**

మనదేశంలో టీ తయారు చేయడానికి నీరు, తేయాకు, చక్కెరను వేర్వేరుగా హీటర్‌లోకి పంపించి, వేడెక్కిన తరువాత ఆ ద్రావణానికి పాలు కలిపి టీగా మార్చడంలో ఈ యంత్రం ఉపయోగ పడుతుంది. అంతేకాదు టీని కూడా మరిగించి వడపోసి కప్‌లోకి తనంతట తానే పంపిస్తుంది.

**వ్యక్తిగత రుచులకు అనుగుణంగా వినియోగదారులు ఏ పదార్థం (మిశ్రమం) ఏ పాళ్ళలో ఉండాలో ముందే నిర్ధారించుకొని యంత్రాన్ని ఆ విధంగా పనిచేసేలా పురమాయించవచ్చు.** పరిమాణం విషయానికి వస్తే నాలుగు కప్పుల వరకు టీని తయారు చేసుకోవచ్చు. కప్పులు సిద్ధం చేసి జారే ట్రేపైన అమర్చినట్లయితే టీ తయారైన తరువాత దానంతట అదే కప్పులను నింపి సిద్ధం చేసిపెడుతుంది. ఈ నాలుగు కప్పుల టీని యంత్రం 5 నిమిషాలలోనే సిద్ధం చేస్తుంది. అదే విధంగా రోజుకు ఎన్నిసార్లైనా టీని తయారు చేసుకోవచ్చు.

యంత్రంలో నీరు, తేయాకు, చక్కెర, ద్రవ రూపంలో వున్న పాలు వేర్వేరు కంటైనర్‌లలో ఉంటాయి. టీకోసం యంత్రాన్ని ప్రారంభించినప్పుడు హీటర్‌లో వున్న పాత్రలోకి ఈ మిశ్రమాలను యంత్రం తీసుకుంటుంది. ఒక వంపు సాయంతో యంత్రం కంటెయినర్ లోని నీటిని వేడి పాత్రలోకి పంపించి మరిగిస్తుంది. నీరు మరిగిన కొంత సేపటికి వేడి పాత్రపైన వున్న వేర్వేరు ఛాంబర్స్ నుంచి తేయాకు, చక్కెరను మోటారు సాయంతో నడిచే యంత్ర వ్యవస్థ ద్వారా కలుపుకొంటుంది. ఈ మిశ్రమాలతో మరికొద్దిసేపు నీరు మరిగిన తరువాత కంటైనర్ నుంచి పాలను సేకరిస్తుంది. ఈ మొత్తం మిశ్రమంతో తయారైన టీ మరో 30 సెకన్ల నుంచి నిమిషం పాటు మరిగి సిద్ధమవుతుంది. ఈ వేడి పాత్ర నుంచి బయటికి వెళ్ళే ఔట్‌లెట్ ట్యూబ్ సాయంతో ట్రే వరకు టీ ప్రవహిస్తుంది. ఈ మొత్తం విధానంలో ప్రతి దశలోనూ సమయాన్ని నియంత్రించు కునే అవకాశం ఉంది. ఇందుకోసం ఒక మెకానికల్ టైమర్ కూడా ఉంటుంది.

**ప్రయోజనాలు:**

టీ మిశ్రమాలను నిలువ చేసే సామర్థ్యం కూడా ఈ పరికరంలో వుంది. నీటిని, పాలను రోజుకు ఒకసారి నిల్వ చేసుకుంటే సరిపోతుంది. చక్కెర, తేయాకును ఒక నెలపాటు నిలువ చేస్తుంది. వ్యక్తిగత



రుచులకు అనుగుణంగా టీని రుచికరంగా తయారు చేసుకునే సౌకర్యం ఉంది. యంత్రంలో అంతర్గత వ్యవస్థలోనే టీ తయారు కావడంతో పాలు చెడిపోవడం లేదా ఆవిరి కావడం వంటి పరిస్థితులను కనిష్ఠ స్థాయికి తగ్గిస్తుంది. వేడెక్కిన నీటిని యూనిట్‌లోని మొత్తం వ్యవస్థకు సరఫరా చేయడం ద్వారా మొత్తం వ్యవస్థ అంతా పరిశుభ్రంగా తయారవుతుంది. హీటర్‌కు తక్కువ విద్యుత్ అవసరం కావడంతో ఇన్‌వర్టర్ సాయంతో విద్యుత్ లేని సమయాల్లో కూడా ఇది పనిచేయగలదు. ఈ యంత్రాన్ని సులభంగా తయారు చేయగల్గడమే కాకుండా సులభంగానూ నడిపే అవకాశముంది. మెయింటెనెన్స్ కూడా కనిష్ఠంగానే వుంటుంది.

ప్రస్తుతం మార్కెట్‌లో వేర్వేరు కంపెనీలు తయారు చేసిన టీ తయారీ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ వాటి వాటి ప్రయోజనాలను ప్రత్యేకంగా కల్గి వుండవచ్చు. అయితే ఇవన్నీ మనదేశంలో టీని తయారు చేసే విధానానికి సరిపడవు. ఇప్పుడున్న ఈ యంత్రాలలో ముందే కలిపి ఉంచిన పొడి లేదా టీ బ్యాగ్స్‌ని ఉపయోగిస్తున్నారు. నీరు ఒక కంటైనర్‌లో మరుగుతుంటుంది. ఈ మరిగిన నీరు మరో కంటైనర్‌లోని తేయాకులో కలుస్తుంది. ఆ తరువాత డికాక్షన్ (బ్లాక్‌టీ) మాత్రమే బయటికి కప్పులోకి చేరుతుంది. ఇప్పుడు మార్కెట్‌లో లభిస్తున్న యంత్రాలను కడగడం కూడా ఒక సమస్య. మరికొన్ని యంత్రాలు అవి పనిచేయడంలో పలు సమస్యలైనా ఎదురవుతున్నాయి లేదా వాటి ధరైనా ఎక్కువగా ఉంది. వీటి ధర దాదాపు రూ. 15,000 వరకు ఉంది. ఇక ఈ కొత్త యంత్రం విషయానికి వస్తే దీని నిర్మాణ వ్యయం కేవలం రూ. 3 వేలు మాత్రమే.

**ప్రస్తుత పరిస్థితి:**

అశోక్ టీ యంత్రాన్ని రూపొందించిన సమయంలో ఇందులో 18 మోటార్లు బిగించాడు. జి.ఐ.ఎ.ఎన్. అనే సంస్థ ఈ యంత్రంలో మార్పులు చేసే బాధ్యతను చేపట్టింది. ఈ విలువ ఆధారిత విధానంలోని ప్రధాన లక్ష్యం యంత్రంలోని కదిలే యంత్ర భాగాలను తొలగించి వాటి స్థానంలో ఎలక్ట్రానిక్ విభాగాలను ఏర్పాటు చేయడం దీనివల్ల యంత్రాన్ని సులభంగా తయారు చేయాలనేది లక్ష్యం. ఈ మార్పుల ఫలితంగా యంత్ర బరువు తగ్గి సామర్థ్యం, పనితనం పెరిగి వ్యయం కూడా తగ్గింది. అనంతరం ఈ యంత్రానికి సంబంధించి ఇంకా ఎలాంటి నదుపాయాల్ని వినియోగదారులు కోరుకుంటున్నారు అనే విషయాల్ని అధ్యయనం చేయడానికి ఒక విద్యార్థి మార్కెట్‌లోకి ఎలాంటి వ్యూహాన్ని ప్రవేశ పెట్టాలి అనే విషయాన్ని తెలుసుకోవడానికి నిపుణులతో చర్చించడానికి ఫోకస్ గ్రూప్‌ని కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చర్చలో తేలిన విషయం ఏమిటంటే, ఈ యంత్రాలను ఉపయోగించ డానికి హాస్టళ్ళు, రెస్టారెంట్లు, కార్యాలయాలు, కార్పోరేట్ సంస్థలు, గృహాలు ప్రధాన మార్కెట్ అవకాశాలన్ని ఈ మార్కెట్‌ని చేరుకోవాల్సి ఉన్నదని. ఈ యంత్ర వినియోగాన్ని వాణిజ్యపరంగా చేపట్టడానికి ముందు మరింత పరిశోధన, మార్కెట్ పరీక్ష సమగ్రంగా జరగాలని వారు నిర్ణయించారు. కొన్ని గుర్తించిన ప్రాంతాలలో ఈ చిన్న టీ తయారీ యంత్రాన్ని ప్రదర్శనకు ఏర్పాటు చేసి వినియోగదారుల నుంచి నేరుగా, అక్కడే అభిప్రాయాలను, సూచనలను స్వీకరించాలని మెరుగులు దిద్దుతూనే ఉన్నారు. ఇది పూర్తయిందంటే భారతీయులు టీ తయారు చేయడంలో ఒక యంత్ర సాయాన్ని ఆశ్రయించవచ్చు. ఎన్.ఐ.ఎఫ్ ఆధ్వర్యంలోని 'మైక్రో వెంచర్ ఇన్నోవేటివ్ ఫండ్' పథకం క్రింద ఈ యంత్రాన్ని అభివృద్ధి పర్చేందుకు గాను రూ. 37,500 ఆర్థిక సాయం కూడా మంజూరైంది. ఎన్.ఐ.ఎఫ్. సంస్థ ఈ యంత్రానికి పేటెంట్ హక్కుల కోసం కూడా దరఖాస్తు (994/డిఇఎల్/2004, 31/5/2004) చేసింది.

గడ్డు స్థితిలో సైతం ఘన విజయం :

అశోక్ స్థానికంగా ఉన్న ఒక కంపెనీలో టర్నర్– ఫిట్టర్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించాడు. రెండేళ్ళపాటు అక్కడ పనిచేసి కొంత అనుభవం సంపాదించాడు. ఇటీవలే మరో సంస్థలో ఉద్యోగం సంపాదించాడు. ఇప్పుడు తనకు వేతనంగా వచ్చే రూ. 2,500లు వారి కుటుంబానికి

నెలసరి ఆదాయం. అందువల్లే తాను ఈ టీ తయారీ యంత్రాన్ని రూపొందించే సమయం లో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా నని, తన కుటుంబ సభ్యుల నుంచి తనకు ఎలాంటి మద్దతు లభించేది కాదని అశోక్ గుర్తు చేసుకున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో నీరుగారి పోవడమే కాకుండా తన ప్రయత్నాలను విరమించుకొనే గడ్డు స్థితులు ఎదురయ్యాయని పేర్కొన్నాడు.

ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ అశోక్ ఆత్మ స్థైర్యాన్ని ఉత్సాహాన్ని ఏ మాత్రం విడువలేదు. తన టీ యంత్రం జిఐఎన్ (నార్త్) తో పాటు పలు ప్రదర్శనల్లో ప్రదర్శనకు నోచుకుంది. 'దైనిక్ జాగరణ్'తో పాటు రెండు స్థానిక పత్రికల్లో ఈ టీ తయారీ యంత్రానికి సంబంధించిన కథనాలు వెలువడ్డాయి. అశోక్ తన ఆవిష్కరణతో సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించాలనే అభిప్రాయానికి వచ్చాడు. ఇప్పటికీ అశోక్ తన సంపాదనలో సగభాగాన్ని ప్రయోగాలు, పనిముట్లు, సాంకేతిక ఉపకరణాల కోసం, పుస్తకాల కోసమే వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం తక్కువ వ్యయంతో విద్యుదుత్పత్తి చేసే 'నీటి రియాక్టర్'ని నిర్మించే ప్రయోగంలో నిమగ్నమై ఉన్నాడు. ఈ రియాక్టర్ నిర్మాణానికి ప్రారంభ వ్యయంగా రూ. 20 నుండి 25 వేల వరకు నిధులు అవసరమౌతాయి. మారుమూల ప్రాంతంలో నుంచి వెలుగులోకి వస్తున్న ఈ ఆవిష్కర్తలోని మొక్కవోని దీక్షని ప్రతి ఒక్కరూ అభినందించాలి. ●

# పల్లెసృజన పాఠకులు కూడా ఇన్నోవేటర్లు కావచ్చు!

మీరు చేయవలసిందల్లా ఈ సంచికనుండి మేము ఓ అంశాన్ని మీకు ఇస్తున్నాము

అందుకు సంబంధించి మీకు తెలిసిన, మీ గ్రామంలో ఎవరైనా చేసిన

పద్ధతులను వివరిస్తూ మాకు వ్రాసి పంపండి. మీరు వ్రాసిన దానిని పత్రికలో ముద్రించడంతో పాటు

పంపినందుకు కానుకగా మీకు ఒక సంవత్సరం పాటు

**పల్లెసృజన**

పత్రికను ఉచితంగా పంపుతాము.

| | |
|---|---|
| ఈ సంచికలో మీకు ఇస్తున్న అంశం : | 'పంటినొప్పి' నివారణకు సాంప్రదాయ మందు.<br>ఉపయోగించిన వారి వివరాలు, ఉపయోగించే పద్ధతులు |

మీ రచనలు పంపవలసిన చిరునామా

ఎడిటర్, పల్లెసృజన, 102, వాయుపురి కాలనీ, సికింద్రాబాద్ - 500 094.

# సుస్థిర సేంద్రియ వ్యవసాయ పద్ధతులు

## సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ వారి స్వచ్ఛంద సేవ




వరంగల్ జిల్లాకు చెందిన 'సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్' 16 మండలాల్లో గత ఆరు సంవత్సరాల నుండి ప్రత్తి, కంది, మిర్చి, వరి, వేరుశనగ, కూరగాయ పంటలలో రసాయన రహిత పద్ధతులు (ఎన్.పి.ఎమ్.) పాటించి పంటలు పండించడం జరుగుతుంది. గత సంవత్సరం నుండి సుస్థిర సేంద్రియ పద్ధతులు అంటే పూర్తిస్థాయిలో రసాయన మందులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, నాణ్యమైన, ఆరోగ్యవంతమైన పంటలు పండించటం, రైతులకు వివిధ రకాలైన శిక్షణలు, క్షేత్ర సందర్శనలు మరియు వారికి అవగాహన కల్పించుటకు వ్యవసాయ సంబంధిత పోస్టర్లు, కరపత్రాలు, స్లయిడ్‌షోలు ఏర్పాటు చేయడం జరుగుతోంది.

**చేయాల్సిన పద్ధతులు:**

- ✤ భూమి లోతుగా దుక్కి చేయడం.
- ✤ పశువుల పెంట తోలడం.
- ✤ వానపాములతో తయారైన ఎరువును వాడటం.
- ✤ పచ్చిరొట్ట ఎరువుల వాడకం జీలుగ, గ్లైరిసీడియా, జనుము, పెసర మొ.
- ✤ చెఱువు మట్టి తోలుకోవడం.
- ✤ నీటిని పొదుపు చేయడం.
- ✤ పంట మార్పిడి చేయడం.
- ✤ జీవన ఎరువుల వినియోగం.
- ✤ వ్యవసాయ వ్యర్థ పదార్థాలు భూమిలో కలిపి దున్నడం.
- ✤ చీడ పీడలను తట్టుకొనే రకాల ఎంపిక.
- ✤ విత్తన శుద్ధి.
- ✤ అంతర పంటలు, ఎరపంటలు వేయడం.
- ✤ లింగాకర్షక బుట్టలు పెట్టి పురుగు ఉధృతిని గమనించడం.
- ✤ దీపపు ఎరలు (లైట్ ట్రాప్స్) ఏర్పాటు చేయడం.
- ✤ పక్షులను ఆకర్షించుటకు పంగ కర్రలు నాటుట.
- ✤ పరాన్న బుక్కులను వదలడము.
- ✤ పసుపు పచ్చ ప్లేటు అమర్చడము.
- ✤ పురుగులను చేతితో ఏరి నాశనం చేయడము.

**కషాయాలు వాడటం:**

- ✤ పొగాకు కషాయము.
- ✤ వేపగింజల కషాయము
- ✤ పశువుల మూత్రం మరియు పేడ ద్రావణము



✤ పచ్చి మిర్చి మరియు వెల్లుల్లి ద్రావణము
✤ చల్లా ఇంగువ ద్రావణము
✤ పంచామృత పాణి

**పొగాకు కషాయము:**

పొగాకు 1 కిలో తీసుకుని (ఆకుగాని, పొడిగాని) 5 లీటర్ల నీటిలో 2-3 గంటల వరకు నానబెట్టాలి. నానిన పొగాకును 0-30 నిమిషాల వరకు ఉడికించవలెను. ఉడికించిన కషాయాన్ని చల్లార్చి సన్నని బట్ట ద్వారా వడపోయాలి. దీనికి 100 గ్రా. సర్ఫ్ పొడిని కలిపి పంట మోతాదును బట్టి ఎన్ని స్ప్రే డబ్బాలు పడతాయో అంచనా వేసుకొని అన్ని లీటర్ల కషాయమునకు నీళ్ళు కలిపి పిచికారి చేయవలెను. దీనివలన పంటపై వచ్చు రసం పీల్చు పురుగులు, పేనుబంక, పచ్చదోమ, తెల్లదోమ నివారణ అగును.



**వేపగింజల కషాయము:**

15 కిలోల వేపగింజలు తీసుకొని దంచినచో 5 కిలోల వేప పప్పు వచ్చును. దీనిని మెత్తగా దంచి ఒక పలుచని గుడ్డలో మూటగట్టి 20 లీటర్ల నీటిలో 12 గంటల వరకు నానబెట్టాలి. ఇలా నానబెట్టిన కషాయాన్ని కిందికి మీదికి తిరగేసినచో తెల్లని, చిక్కని ద్రావణము తయారగును. దీనికి 100 గ్రా. సర్ఫ్ పొడి బాగా కలిపి పంట మోతాదును బట్టి ఎన్ని డబ్బాలు స్ప్రే చేయాల్సి వుంటుందో, అన్ని సమభాగాలు చేసుకోవాలి.

స్ప్రే డబ్బాలో కషాయము పోసి, దాని నిండా నీళ్ళు కలిపి పంటపై పిచికారి చేయాలి. దీనివలన రసం పీల్చు పురుగులు, కాయ తొలుచు పురుగులు (పచ్చపురుగు, లద్దెపురుగు) నివారణ జరుగును.

**పశువుల మూత్రం & పేడ ద్రావణము:**

5 లీటర్ల పశువుల మూత్రం (ఆవు మూత్రం అయితే మంచిది), 5 కిలోల పేడ, 5 లీటర్ల నీరు తీసుకొని ఒక కుండలో వేయాలి. దీనికి 150 గ్రాముల సున్నము కలిపి గాలి పోకుండ గుడ్డతో మూట కట్టాలి. ఇప్పుడు దీనిలో అమ్మోనియా లాంటి చెడువాసన వస్తుంది. దీనికి 100 గ్రాముల సర్ఫ్ పొడిని కలిపి పంట మోతాదును బట్టి అన్ని భాగాలు చేసుకొని స్ప్రే డబ్బాలో నీళ్ళు, కషాయము కలిపి పంటపై పిచికారి చేయాలి.

దీనివలన చెడు వాసనకు పచ్చపురుగు, తల్లి పురుగు, గ్రుడ్డు పెట్టకుండా దూరంగా వెళ్ళిపోతాయి. ఈ కషాయము వలన మొక్క పచ్చగా, బలంగా పెరిగి అధికపూత, కాయలను కాస్తుంది. ఆకుల ద్వారా మొక్కకు కావలసిన పోషక పదార్థాలు అందును.



**పచ్చి మిర్చి మరియు వెల్లుల్లి ద్రావణము:**

మూడు నుండి నాలుగు కిలోల పచ్చి మిర్చిని తొడిమెలు తీసివేసి మెత్తగా రుబ్బి, 10 లీటర్ల నీటిలో నానబెట్టాలి. వేరొక పాత్రలో 750 గ్రా. వెల్లుల్లిని దంచి 250 గ్రా. కిరసనాయిల్‌లో నానబెట్టాలి. 5-6 గంటలు నానిన తర్వాత రెండింటిని వేర్వేరుగా వడపోసి రెండింటిని కలపాలి. దీనికి 150 గ్రా. సర్ఫ్



వద్ద చల్లుకోవాలి. లేదా నీళ్ళు కడుతున్నపుడు నీటిలో కలిపి పంటకు పారించాలి. (డ్రిప్ సిస్టంలోనైతే ఇసుక ఫిల్టర్‌లో కలపాలి)

ఇలా చేయడం వల్ల నేల గుల్లబారి, మొక్కలకు కావలసిన సూక్ష్మ స్థూల పోషక పదార్థాలు అందిస్తుంది. మొక్కలకు రోగాలను తట్టుకొను శక్తి పెరుగుతుంది. చేను ఏపుగా పెరిగి, పంట దిగుబడి అధికంగా వస్తుంది. మిత్ర కీటకాలను ఎక్కువ అభివృద్ధి చేస్తుంది.

ఇలాంటి సేంద్రియ పద్ధతుల ద్వారా పంటలు పండిస్తే వచ్చే దిగుబడి ఎక్కువ కాలం నిల్వ ఉండటమే కాకుండా మంచి మార్కెట్ విలువతో పాటు, వాతావరణ కాలుష్యాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని కూడా కాపాడినవారం అవుతాము.

పొడిని కలిపి పంట మోతాదును బట్టి ఎన్ని డబ్బాలు స్ప్రే చేయాల్సి వుంటుందో, అన్ని సమభాగాలు చేసుకొని స్ప్రే డబ్బాలో నీళ్ళతో కలిపి పిచికారి చేయాలి.

ఈ కషాయము ఘాటు వల్ల పచ్చపురుగు, లద్దెపురుగులు తట్టుకొనలేక, ఆకులను, కాయలను తినలేక చనిపోతాయి. దీనిలో కిరోసిన్ కలపడం వలన కిరోసిన్ పచ్చ పురుగు, లద్దె పురుగు శరీరంలోకి పోయి వాటి జీర్ణ వ్యవస్థపై దెబ్బతీస్తుంది.

**మజ్జిగ(చల్ల) - ఇంగువ ద్రావణము:**

చిక్కని మజ్జిగను 5 లీటర్లు తీసుకుని దానికి 50 గ్రా. ఇంగువ కలిపి ఒక మట్టి కుండలో పోసి 6 రోజులు పెంట కుప్పలో పాతి పెట్టాలి. ఈ ద్రావణాన్ని 6 రోజుల తర్వాత తీసి ఒక ఎకరము పంటకు పిచికారి చేయాలి. దీనిని 15 లీటర్ల నీటికి 2 లీటర్ల మజ్జిగ ద్రావణాన్ని కలిపి పిచికారి చేయాలి.

పంట 30 రోజులు ఉన్నప్పుడు (ప్రత్తి, వరి, మిర్చి, జొన్న) పిచికారి చేస్తే మొక్క బలంగా పెరగటమే కాక, రోగ నిరోధక శక్తి కూడా పెరిగి కాయతొలుచు పురుగు, రసం పీల్చు పురుగులను రాకుండా చేస్తుంది.

**పంచామృత పాణి:**

100 లీటర్ల నీరు, 5 లీటర్ల ఆవు మూత్రం, 15 కిలోల పేడ, ఒకటిన్నర కిలోల బెల్లం, 120 గ్రాముల నెయ్యి మొత్తాన్ని ఒక పెద్ద డ్రమ్ముగాని, గోళంలోగాని వేసి బాగా లపాలి. దీనికి గాలి తగలకుండా మూతపెట్టాలి. ఆరు రోజులు బాగా మాగిన తర్వాత 7వ రోజు చేలోని మొక్కల మొదళ్ళ

**ఇంకా ఇలాంటి ఎన్నో రకాల సలహాల కొరకు** :

సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్,
హన్మకొండ, వరంగల్ జిల్లా వారిని ఉత్తరం ద్వారాగాని, ఫోన్ నెం. 08717-243767లో సంప్రదించవచ్చు.





# స్కూటర్లు, మోటార్ సైకిళ్ళ
# ప్రయాణాల్లో చంటిపిల్లల సంరక్షణ

స్కూటర్, మోటార్ సైకిళ్ళపై చంటిపిల్లలను వేసుకుని వెళ్తున్న జంటలను మనం రోడ్డుపై గమనించే వుంటాం. చంటి పిల్లలను ఒళ్ళో కూర్చోబెట్టుకోవడం ఒకింత కష్టతరమైనపనే. ఒకవేళ చేయి జారితే జరగబోయే పరిణామాన్ని ఊహించడానికి కూడా భయపడతాం. అంతే కాకుండా ప్రస్తుత వాతావరణ కాలుష్యం చంటి పిల్లల ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీసే ప్రమాదముంది.

వరంగల్ లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కిట్స్) ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థి శైలేంద్ర కుమార్ తయారు చేసిన ఈ పరిశోధనాత్మక పరికరం ద్విచక్ర వాహనాలపై కాని, ఇతర వాహనాలపైకాని ప్రయాణం చేసేటప్పుడు చంటి పిల్లల సంరక్షణకు సమర్థవంతంగా పనిచేస్తుంది. ఈ పరికరం రూపకల్పన ఈ విధంగా వుంటుంది....

ఇది సాధారణంగా రెండు రకాలుగా వుంటుంది. ఒకటి వాహనానికి బిగించబడినది. రెండవది ఒక సురక్షితమైన సంచిలాగా రెండో సీటుకు బిగించబడి వుంటుంది. ఉపయోగించే వారికి అనుకూలంగా లేదా లింకులతో అవసరానుగుణంగా సర్దుబాటు చేసుకునేటట్లు, వాహనానికి వెనుక భాగంలో ఏర్పాటు చేసుకునేట్లు వుంటుంది. ఈ పరికరం పారదర్శకమైన ఒక మెష్ ద్వారా చంటి బిడ్డలను అన్ని విధాలైన వాతావరణ కాలుష్యాల నుండి, దుమ్ము, ధూళి నుండి, ఇతరత్రా అన్ని ఇబ్బందుల నుండి రక్షిస్తూ శ్వాస తీసుకోవడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చక్కని సంరక్షణిగా పని చేస్తుంది. ఈ పరిశోధనా విధానంలో ఒక ప్రధాన ఇనుప కడ్డి ద్వారా వాహనం బేస్‌కు అమర్చబడి రెండవ ఇనుప కడ్డీ అవసరాన్ని బట్టి సరిచేసుకునే విధంగా ఈ మొదటి కడ్డీకి బిగించబడి వుంటుంది. ఇక మూడవ కడ్డి ప్రధానమైనది. ఇది చంటి పిల్లలను సంరక్షించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. చంటి పిల్లల సంరక్షణి దీనికి అనుసంధానం చేయబడి వుంటుంది.

సాధారణంగా ఎదురయ్యే అన్ని ఇబ్బందులను అధిగమించేందుకు అనుకూలం గా అదే ఏకైక లక్ష్యంగా ఈ 'చంటిబిడ్డల సంరక్షణి' పరకరం రూపొందించబడింది. ఈ పరికరం లోపలి భాగంలో మెత్తని స్పాంజి మరియు గుడ్డలతో అమర్చబడి వెలుపలి భాగం నీటికి తడవకుండా, వాననుండి సంరక్షిస్తూ, పెను గాలుల మూలంగా వచ్చే దుమ్ము, ధూళి నుండి ఇతరత్రా వాతావరణ ప్రభావాల నుండి కాపాడే గట్టి కాన్వాస్‌తో తయారు చేయబడి వుంటుంది. ఈ చంటి పిల్లలను కూర్చోబెట్టే ఛాంబర్ ప్రయాణించే వారికి అనుగుణంగా తగిన దిశకు మార్చుకునే అవకాశం వుంటుంది. దీని లోపలి భాగం విశాలంగా చంటి బిడ్డలు ఎలాగైనా తిరగడానికి అనువుగా మంచినీళ్ళు మరియు పాలసీసాలు ఉంచుకునేందుకు వీలుగా ఉంటుంది. ప్రయాణించేటప్పుడు ఏదైనా చిన్న చిన్న మార్పులు అవసరమైతే పై భాగం మొత్తం తొలగించి సరిచేయడం ప్రమాదకరం కాబట్టి అలాంటి అవసరం లకుండా చిన్న చిన్న మార్పులు చేసుకునేందుకు వీలుగా ఒక హ్యాండిల్ ఈ ఛాంబర్‌లో అమర్చబడి వుంటుంది. రాత్రిళ్ళు ప్రయాణించేటప్పుడు పాపను చూస్తుండటానికి, చిన్న చిన్న మరమ్మత్తులు చేసుకోవడానికి అవసరమైన వెలుతురును ఇచ్చేందుకు ఈ ఛాంబర్ లోపలి భాగంలో ఒక లైటు అమర్చబడి వుంటుంది. ఈ పరికరం బండి నడిపేవారికి, వెనుక కూర్చునే వారికి చేరువలో వెనుక మనిషి అవసరం లేకుండా తానే ఒకవేళ ఉన్న పాపను గమనిస్తూ కోర్చోవడమే తప్ప ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించే విధంగా రూపొందించబడింది.

ఈ పరికరంలో ఒక చిన్న బటన్ నొక్కడం ద్వారా ముడుచుకొని, అవసరమైతే తెరుచుకోవడం జరుగుతుంది. అవసరం లేనపుడు ఒక గొడుగులాగా ముడిచేసి డిక్కీలో పెట్టుకోవచ్చు.

ఇది చుట్ట చుట్టుకునే ఒక సంచిలాగా తయారవుతుంది. ముందువైపు పిల్లలను ఉంచుకోవడానికి, వెనుకవైపు పట్టు కోసం గట్టిగా ఉంటుంది. ముందు భాగంలో పాపాయిని ఉంచుకునే ఛాంబర్ కలిగి పైన పేర్కొన్నట్లుగా అన్ని సౌకర్యాలు కలిగి వుంటుంది. దీనిని ఉపయోగించే వారికి అనుకూలంగా ఉంటేట్లు శరీర కొలతలకు, బరువుకు, భూమ్యాకర్షణ శక్తికి సరిపోయేలా రూపకల్పన చేయబడింది. ఆ విధంగా ఈ ట్రావెల్ బేబి ప్రొటెక్టర్ (టిబిపి) అనగా 'ప్రయాణాల్లో చంటిపిల్లల సంరక్షణి' రక్షణ, సౌలభ్యతను దృష్టిలో పెట్టుకొని చేయబడిన ఈ రూపకల్పన అత్యంత ఉపయోగకరంగా వుంది. **వివరాలకు శైలేంద్రకుమార్, ఫోన్ నెం. 99486 50046.**


# ఇతర రాష్ట్రాల పల్లెకబుర్లు

## బట్టల నేతలో అడ్డనూలు పంపే విధానం


తమిళనాడుకు చెందిన షణ్ముగం అనే 26 సంవత్సరాల విద్యార్థి బట్టల నేతలో అడ్డనూలు పంపే విధానాన్ని చక్కగా ఆధునికంగా అమలు పరచాడు. అతను యస్‌యస్‌యం కళాశాలలో 3వ సంవత్సరం డిప్లమా చేస్తున్నాడు.



అతని ప్రతిభవల్ల, పనిపై శ్రద్ధవద్ద డిప్లమా రెండవ సంవత్సరంలో నేరుగా విద్యాప్రవేశం జరిగింది. నూలు బట్టల నేత పరికరాలు అతనిచే నూతనంగా ఆవిష్కరింప బడ్డాయి.



అది అతని జీవనోపాధిగా మారటంతో పాటు తన తోటి వృత్తిపనుల వారి పట్ల శ్రద్ధ ఈ



పరికరాల ఆధునీకరణకు దారితీశాయి. షణ్ముగం తన బంధువుకు సంబంధించిన నేత మిల్లులో కొంత కాలం అడ్డనూలు మీద పరిశోధనలు చేశాడు. బట్టలు నేయడంలో అడ్డంగా నూలు పంపే ప్రక్రియలో విద్యుత్తు, మానవ శక్తి కొంత భాగం అనవసరంగా పోవడం గమనించాడు. పరికరాలు పలుమార్లు మార్చడం వల్ల జరిగే ఈ నష్టాన్ని నివారించే నూతన మార్గాన్ని కనుగొన్నాడు. రెండు చిన్న పరికరాలను అమర్చడం ద్వారా అడ్డనూలును నిరంతరాయంగా పంపే విధానాన్ని అమలు చేశాడు. ఇందులో ఖర్చు చాలా స్వల్పం. అంతే కాక 15-20 శాతం నాణ్యత పెరగడంతో పాటు విద్యుత్తు, మానవ శక్తి కూడా ఆదా అవుతుంది.

## కారు నడపటంలో వికలాంగులకు ఉపయోగపడే పరికరం

ముజీబ్‌ఖాన్ అనే 33 సంవత్సరాల వ్యక్తి పోలియో బాధితుడు. అతనికి భార్య, నలుగురు సంతానం. తన చిన్ననాటి నుండి వచ్చిన అంగ వైకల్యాన్ని అతడు పట్టించుకోలేదు.



అతను తన స్వయంశక్తిమీద ఆధారపడి తనలాంటి వారికి సహాయపడే పరికరాన్ని తయారు చేశాడు. సాధారణంగా కారు నడపాలంటే కాళ్ళమీదనే ఆధారపడతాము. కానీ సత్తువలేని కాళ్ళతో కారు నడపటం సాధ్యం కాదు. ఇందుకుగాను అతను తన స్వయంకృషితో నూతన పరికరాన్ని తయారు చేశాడు. దీని ద్వారా యాక్సిలేటర్, బ్రేక్, క్లచ్ ఈ మూడింటిని కూడా స్వల్ప మార్పులతో లివర్, తీగల ద్వారా అనుసంధానించడంతో చేతితోనే అన్నింటిని నియంత్రించవచ్చు. తమ మారుతి వ్యానులో తనవారికి తెలియకుండా అసాధారణ కృషితో





దీనిని సాధించాడు. తనలాంటి వారికి ఉపయోగపడే విధంగా ఇప్పటికి 70కి పైగా కార్లలో దీనిని అమర్చాడు.

## ధాన్యం నుండి గ్రాసం వేరు చేసే పరికరం



స్వర్గీయ దిలీప్ సింగ్ రాణా గారు ఈ యంత్రాన్ని తయారు చేశారు. ఇది వ్యవసాయ దారులకు చాలా ఉపయోగకరంగా వుంటుంది. వారి నుండి ఏమీ ఆశించకుండానే ఈ యంత్రాన్ని తయారు చేశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు వున్నారు. సాధారణంగా వరిని తొడిమలనుండి వేరు చేసేటప్పుడు, దంచేటప్పుడు ధాన్యం కొంత చితికిపోతుంది. పురాతన పద్ధతుల ద్వారా చేసే ఈ ప్రక్రియలో ఎండుగడ్డి కొంత



పోతుంది. కాని, రాణాగారు చేసిన ఈ యంత్రం ఖర్చును తగ్గిస్తుంది. వేగంగా పనిచేసి పూర్తిగా పసుగ్రాసాన్ని వేరు చేస్తుంది. వరిగడ్డిని కాగితం తయారీ కర్మాగారాలలో కూడా ఉపయోగిస్తారు.

## చెరుకు వ్యవసాయంలో సులభ పద్ధతులు

శ్రీ గణేష్ మూర్తి అసారి అనే 47 సంవత్సరాల వ్యక్తి చెరకు పంటలు బాగా పండే ప్రాంతంలో పుట్టి పెరిగాడు. ఈయన ట్రాక్టర్ రిపేరు పనులు చేనస్తావుంటారు. వ్యవసాయ దారుల ఉపయోగార్థం పలు వరాగ్గాలనం అన్వేషిస్తున్నారు. వీరు చెఱకు రైతులకోసం మూడు పద్ధతులను పెంపొందించారు. 1.






పాత విధానంలో చెఱకు తోటలు నరకడంలా కాకుండా, ట్రాక్టరుకు నూతన పరికరం అనుసంధానించి కాండం నుంచి చెఱకు సేకరించడం. 2. క్రాక్టరు లాగానే "పవర్ టిల్లర్"తో కూడా అనుసంధానించడం. 3. చెఱకులో పనికిరాని భాగాలను చిన్న చిన్న ముక్కలుగా 2 నుండి 20 మి.మీ. వరకు చేసి పశుగ్రాసంగా వాడటం. దాణా లేక మేత అని కూడా అంటారు.

తెల్లని పూలు : కొత్తరకం ఏలకుల పెంపకం

శ్రీ యం.కె. చేబిగారు 66 సంవత్సరాల వయస్సులో తమ 20 ఎకరాల భూమిలో మేలురకం ఏలకుల పెంపకాన్ని చేపట్టారు. ఆయన భార్య, సంతానం అందరూ వీటి పెంపకానికి దన్నుగా నిలిచారు. చేబి గారు రూపొందించిన తెల్లటిపూల మేలురకం ఏలకులు మిగిలిన వాటికన్నా ఎక్కువగా, ఎక్కువ నూనెతో పుష్కలంగా వున్నవి. ఈ రకం ఏలకులు తేమ ప్రదేశంలో ఎండ తగలని చోట బాగా పండుతాయి. వీటి మొక్కల వేళ్ళు చాలా





లోతుగా వుండేట్లు రూపొందించారు. దీనివల్ల ప్రకృతిపరమైన అవరోధాలని అధిగమిస్తాయి. చేబిగారి నైపుణ్యానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైస్ రీసెర్చ్ వారు గుర్తించారు. ఆయనలో అలసట కనిపించదు. వీటిని ప్రస్తుతం కేరళ, కర్నాటక మరియు తమిళనాడులో పండిస్తున్నారు.

## మిరియాల పంటలో సరికొత్త విధానం

కేరళలో 51 సంవత్సరాల పాపచ్చన్ అనే వ్యవసాయం దారుడు తన పొలాల్లో వేరుకొరకుడు వ్యాధి సోకి పంట అంతా ఎోవడంతో చకతాచారా అనే తన గ్రామం వదలి వెళ్ళవలసి వచ్చింది. ఆయన ప్రస్తుతం కొంత భూమిలో మరియాలు, రబ్బరు సాగు చేస్తున్నారు. నీటిపారుదలలో నూతన విధానం ద్వారా ప్రకృతిపరంగా నీటి పారుదల చేస్తూ మొక్కల వేళ్ళను లోతుగా వుండేట్లు పెంచారు. దీనితో దిగుబడి దాదాపు మిగిలిన తరహా పెంపకాలమీద రెట్టింపు వస్తున్నది.





## చేరాసియా నీటిమీద నడక ప్రయోగం

శ్రీ ద్వారకా ప్రసాద్ చేరాసియా గారి వయస్సు దాదాపు 75 సంవత్సరాల క్రితం నారిమాన్ పాయింట్ నుండి చేపాటి వరకు సముద్ర తీరంలో సైకిలు తొక్కినారు. ఆయన నీటి మీద కూడా నూతన తరహా పాదరక్షలు ధరించి నడిచారు. చౌరాసియా గారు తయారు చేసిన నీటిపాదరక్షలు అనేక విధాలుగా నీరు వున్న






ప్రాంతవాసులకు ఉపయోగపడతాయి. ఇవి ఆయన విపరీతమైన కోరికల నుండి జనించాయి. ఇవి నీటిలో ఆటలకు కూడా ఉపయోగిస్తూ, నీటి ప్రవాహాలలో వచ్చే



ఆటంకాలను కూడా తీయటానికి ఉపకరిస్తాయి. ఇవి తేలిక పదార్థాలతో చేయబడినవి. ధర్మకోల్ కూడా వాడబడింది. ఇవి 3 అడుగుల పొడవు, 10 అంగుళాల వెడల్పు, 8 అంగుళాల మందంతో వుంటాయి. వారి వలన యువతకు, పెద్దవారికి కూడా స్ఫూర్తి ఏర్పడింది.

## అధిక దిగుబడినిచ్చే 'మొరాలో' రకం వేరుశనగ

శ్రీ తాకర్షి సవాలియా గారి వయస్సు 70 సంవత్సరాలు ఆయన తన 4వ తరగతిలో చదువు ఆపి తన తండ్రి త్రోవలో



వ్యవసాయంలో కాలుమోపినారు. 'జనాగడ్' ప్రాంతం అంతా తాకర్షి భాయి గారి పేరు తెలుసు. ఆయన 'మొరాలో' అనే రకం వేరుశనగను ఆ ప్రాంతం అంతా విస్తరించి సాగుబడి చేయించారు. ఆయన వారి పుత్రునితో వేరుశనగ పండించే సమయంలో రెండు మొక్కలను ప్రత్యేకంగా గుర్తించారు. ఇవి మిగిలిన వాటికంటే ఎక్కువగా పచ్చగా, ఎక్కువ




పూలతో గింజలతో వున్నవి. వీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వాటి విత్తనాలు భద్రపరచి ఈ పంటను పలురెట్లు అధికంగా వచ్చేట్లు చేశారు. ఇది 1986 ప్రాంతంలో వారి అబ్బాయి నితిన్‌తో కలసి చేసినారు. ఈ వేరుశనగలో తీయదనం ఎక్కువ. గింజలు ఎక్కువ. అంతే కాకుండా ఈ పంటలకు 'టిక్కా' అనే వ్యాధి కూడా సోకదు. మిగిలిన వాటివలె 4 నెలల్లో కాకుండా కేవలం 90 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఈ వేరుశనగ కాయలు నెమలి ఆకారంలాగా కనిపించటంతో 'మొరాలో' అని నామకరణం చేశారు.

## 5 చక్రాల చవక కారు

మనోజ్ అనే 18 సంవత్సరాల బాలుడు తన సోదరుడు 21 సంవత్సరాల హరిమోహన్ తో కలిసి అత తక్కువ ఖర్చుతో 5 చక్రాల కారు నమూనా తయారు చేసినారు. దీనికోసం వారు చెత్తసామాన్లు



ఎంచుకున్నారు. వాడిన స్కూటరు టైర్లు 'మోపెడ్' ఇంజను, నికల్ పైపులతో ఛాసిస్ తయారు చేశారు. మామూలుగా రెండు ముందు టైర్లు, రెండు వెనుక టైర్లు



వుంటాయి. మధ్యలో 5వ టైరు వుంచి దానిని స్టీరింగ్‌తో అనుసంధానించారు. వారి లెక్క ప్రకారం ఇది సామాన్యులకు అందుబాటులో వుండే ఖర్చుతో నడుస్తుంది. 70 నుండి 80 కి.మీ. వేగంతో ఒక లీటరు ఇంధనంతో 75 నుండి 80 కి.మీ. దూరం ప్రయాణించవచ్చు. ప్రస్తుత వాహనాలు 18 నుండి 20 కి.మీ. మాత్రమే ఇవ్వగలవు. కావున వారి అంచనాలు బాగున్నాయి.

## బహువిధాల ఉపయోగపడే వికలాంగులపరికరం

రాకేష్ కుమార్ పాత్రా అనే 10 వ



తరగతి బాలుడు వికలాంగులకు బహుదూరం నడవటానికి, అలసట లేకుండా వుండటానికి చెక్కతో చేసిన పరికరాన్ని రూపొందించాడు. దీంతో మడత పెట్టే కూర్చుండే పరికరం, దీపం, అలారం,




గొడుగు అమర్చాడు. ఈ పరికరం సాయంతో వికలాంగులు కావలసిన చోట ఆగి విశ్రాంతి తీసుకొని మరలా ప్రయాణం కొనసాగించ వచ్చు.

### పంటలను పెంపొందించే గుళికలు

నితిన్ కుమార్ త్యాగి అనే 21 సంవత్సరాల బి.ఏ. చదివిన యువకుడు కంప్యూటర్ దుకాణం నడుపుతున్నాడు. అతని దగ్గరకు ఒక వ్యవసాయదారుడు వచ్చి 'వెర్మి కంపోస్ట్' ను గుళికల రూపంలో చేయాలని సవాలు విసిరాడు. సాధారణంగా మందుల రసాయన పరిశ్రమలలోనే గుళికలు చేసే వీలుంటుంది. ఈ పంటలు





అధిక దిగుబడికి వెర్మిని ద్రవరూపంలో గాని పొడి రూపంలోగాని వాడతారు. త్యాగి కొద్ది నెలల లోనే గుళికలు చేసే యంత్రాన్ని తయారు చేశాడు. దీనికిగాను అతను ఔషధ పరిశ్రమలో వాడే యంత్రాల నమూనాను వ్యవసాయ గుళికలు తయారు చేసే విధంగా మార్పు చేశాడు.

### వేడిమినుండి చల్లపరిచే గొడుగు

సుప్రియా చోత్రే అనే 13 సంవత్సరాల బాలిక ఒరిస్సాలో 2003లో వచ్చిన అతి వేడిమి చూసి ఒక గొడుగును రూపొందించింది. దీనికి ఆమె తన ఉపాధ్యాయుల సలహా తీసుకున్నది. ఈ గొడుగు పైన తెల్లటి గుడ్డతో మధ్యలో స్పాంజి, క్రింద నల్లటి గుడ్డను అమర్చింది. క్రింద నీటిని వెదజల్లే పరికరం అమర్చింది. వేడిమి 35 డిగ్రీల సెంటీగ్రేడ్ దాటితే గొడుగుకు అమర్చిన థర్మామీటర్ అలారం మోగిస్తుంది. వెంటనే నీటిని వెదజల్లే పరికరం రెండు గుడ్డల మధ్య







వున్న స్పాంజిని నీటితో తడుపుతుంది. ఈ గొడుగు వాడటం ద్వారా చల్లటి అనుభూతి కలుగుతుంది.

### మురుగునీటి నుండి విద్యుత్తు పొలాలకు నీరు

మోక్షద్ పినాకిన్ థాకర్ అనే 15 సంవత్సరాల బాలుడు ఈ యంత్రాన్ని తయారు చేశాడు. అతను చిన్నతనంలో ఇంటి పైనుండి కింద పడటంతో తలకు దెబ్బ తగిలింది. ఆ దెబ్బనుండి కోలుకునే సమయంలో అతని తల్లిదండ్రులు అనేక పుస్తకాలు






చదువుకోవడానికి ఇచ్చేవారు. ఆ పుస్తకాలను చదవటం ద్వారా అతనికి అనేక విషయాలపై ఆసక్తి పెరిగింది. మరుగునీటిలో వుండే ఘన పదార్థాలను వేరుచేసి 'బయోగ్యాస్ ప్లాంట్'లో ఉపయోగించడం , వడగట్టిన నీటిని టర్బయిన్ ద్వారా పంపి విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని చూపించాడు. ఇది ప్రస్తుతం ఐ.ఎ.ఆర్.ఐ. వారి పరీక్షలో వున్నది.

**మీక్కూడా ఇలాంటి చిన్న చిన్న ఆలోచనలు వస్తే వాటిని తయారు చేసి వుంటే వెంటనే మాకు పంపండి. 'పల్లెసృజన'లో ప్రచురించటంతో పాటు మంచి బహుమతి కూడా వుంటుంది.**

– ఎడిటర్.



# వరంగల్ జిల్లా ఆదివాసుల (కోయ) సంస్కృతి - ఆచారాలు - 2

- పోదెం సమ్మయ్య

**హనీబీఏపి వాలంటీర్లు వరంగల్ జిల్లాలో ఆదివాసులతో 'జ్ఞాన సముపార్జన యాత్ర'లో మూడు రోజులు గడిపారు. వారి ఆచార వ్యవహారాలు, సాంప్రదాయ పద్ధతులను గురించి, వారిలో ఒకరు శ్రీ సమ్మయ్య ఆదివాసీ పెద్దలను సంప్రదించి, ఎంతో శ్రమతో వివరంగా వ్రాసి మాకు అందించారు. యధాతథంగా ప్రధమ భాగాన్ని గత సంచికలో ప్రచురించాము. చివరి భాగాన్ని ఈ సంచికలో అందిస్తున్నాము.**
**- ఎడిటర్**

ఎవరైన వ్యక్తి చనిపోయినచో ఏ తీరులో చనిపోయినాడో అతే రీతిలో ఉంచి వారి బంధువులు వచ్చిన తర్వాత చనిపోయిన వ్యక్తిని ఎక్కడ పెట్టాలో నిర్ణయించి పెండ్లి అయిన వారిని కట్టె దహనం చేస్తారు. పెండ్లికాని వారిని బొంద పెడతారు.

ఇంటివారు గ్రామస్తులు వచ్చిన బంధువుల కట్టె దహనం అయితే గ్రామంలో ఇంటికో మనిషి గొడ్డలి పట్టుకొని అడవికి వెళ్ళి 3 లేక 5 సార్లు తీసుకు వచ్చిన కట్టెలను ఒక దగ్గర చేర్చి ఆ ప్రక్కన నెగడి పెట్టి ఉంచుతారు. చితి పేర్చినవారు వచ్చిన తర్వాత ఆ గ్రామంలో పెద్దలు, వంశానికి ఒక వ్యక్తిని తీసుకుని ఆ నలుగురు కలిసి ఆ శవమున్న మంచాన్ని ఆ నలుగురు నాలుగు కొమ్ములు పట్టుకొని ఇంట్లోనుండి బయటకు తీసుకు వచ్చి పీట వేసి దానికి (బాషికం) అనగా పసుపు, కుంకుమ పూయించి చనిపోయిన వ్యక్తిని ఆ పీటపై నిల్చోబెట్టి స్నానం చేయించి పసుపు, కుంకుమ పూసి కొత్త బట్టలు కట్టబెట్టి మంచంపై పడుకోబెట్టి కులాచారం ప్రకారం చప్పుళ్ళు అనగా డోలి డప్పులు చప్పుళ్ళతో తీసుకెళ్తూ ఆది లేదా మంగళ వారాల్లో చనిపోతే బొంగు పేలాలు చిల్లర పైసలు చల్లుకుంటూ బయలుదేరతారు. బయలుదేరే ముందు కొడుకులు ఉంటే కొర్రాయి ఆ మూకుట్లో పసుపు కలిపి వండిన అన్నం ఒకచేత, నిప్పు కొర్రాయి పసుపు బియ్యం ఒకచేత కుండలో కొంచెం నీళ్ళతో బయలు దేరతారు. బిడ్డలు బంధువులు ఏడుస్తూ బయలుదేరుతారు.





**దింపుడు కల్లం :**

బయలు దేరిన మార్గం మధ్య మంచం దించి మంచం నలుమూలల వ్యక్తులు భుజాలు మారుస్తారు. మార్చేముందు పసుపు బియ్యం చిల్లర పైసలు వడ్డె తలగోరి పట్టిన వ్యక్తి పసుపు బియ్యం, చిల్లర పైసలు నాలుగు కోస్తులపై వేయించుతారు. ఆ తరువాత ఆడబిడ్డలు బంధువులు ప్రాణం ఉందా, పోయినదా అని మరోసారి అతని పేరు పెట్టి పిలుస్తారు. ఆ తరువాత సెలవేనా అని పిలిపిచ్చి మళ్ళీ ఆ శవాన్ని తీసుకొని చితి పేర్చిన కాడికి తీసుకెళ్ళి నిశాల మూల నుండి మూడుసార్లు తిప్పి చితికి ఎక్కిస్తారు. చనిపోయిన వ్యక్తి మగ అయితే మొలదారం, కంకణాలు, ఏమైనా వుంటే తీస్తారు. ఆడవారయితే గాజులు, మంగళ సూత్రాలు, నగలు తీసి చనిపోయిన ఇంటి వారికి ఒప్పజెప్పి మంచం కోళ్ళు గొడ్డలితో పగలగొట్టి ఆ పట్టెలు, ఆ కోళ్ళు ఆ చితిలోనే పెట్టి పైనుంచి వేసిన దుప్పటిని నోటి దగ్గర గొడ్డలితో రంధ్రం చేసి తర్వాత వడ్డెను గొడ్డెల పట్టమని తలగోరి పట్టిన వ్యక్తి కుండను ఎడమ చేతి భుజాన పెట్టి గొడ్డలితో ఒక చిల్లు (రంధ్రం) నీరు కారేటట్లు చూసి చితి చుట్టూ 3 సార్లు తిప్పుతారు. తలగోరు నిశానవైపు చితికి వెనుక చేసి అక్కడున్న వ్యక్తులకు వినబడేటట్లు సెలవేనా అనిపించిన తర్వాత ఆ కుండను, ఆ పసుపు బియ్యం మూకుడు నిప్పు కొర్రాయిని 3సార్లు వెనకకు ముందు ఊపించి చితి దగ్గర వేయిస్తారు. ఆ తర్వాత వడ్డెతో ఆ కుండను ఆ మట్టి మూకుడును ఒక దగ్గర చేర్చి చితికి కొట్టించి అందులో ఏ నీటి చుక్క కూడా నిలువకుండా నుజ్జు నుజ్జుగా కొట్టించి అటువైపు ఒకరు ఇటువైపు ఒకరు ఆ యింటి వారి గొడ్డలిని ఇటునుండి అటు, అటునుండి ఇటు మూడుసార్లు వేయించి, సరైన పద్ధతిలో గొడ్డలిని వేయించిన తర్వాత అక్కడ పెట్టిన చిన్న కుంపటి నుండి నిప్పులు కొర్రాయిలు మొత్తం తీసుకువచ్చి తలవైపు కాళ్ళవైపు నిప్పు అంటిస్తారు. బాగా అంటుకొనేంత వరకు పచ్చిరొట్టతో విసిరి రగిలించి తర్వాత వాగు గాని, మడుగు గాని నీరు ఉన్నచోటకి వెళ్ళి తలగోరి పెట్టిన వ్యక్తిని ముందు తలదిపార స్నానం చేయిస్తారు.

ఆ తర్వాత ఇంటివారు పాలివారు వెళ్ళిన వారందరూ తలదిపార స్నానం చేస్తారు. తర్వాత ఆ ఇంటికి వచ్చిన తరువాత అరుగు బయట మట్టి కుండలో కొన్ని నీళ్ళు పెట్టి పైన పేడతో చేసిన బరిడి చిప్ప అందులో నూనె పోసి వత్తి వేసి వెలిగిస్తారు. కాష్టం కాడికి పోయి వచ్చిన ప్రతిఒక్కరు కాళ్ళు కడిగిన తర్వాత ఆ కుండ దగ్గరకు వెళ్ళి ఎడమ చేతి చిటికెన వ్రేలును నీటిలో ముంచి దీపంపై చల్లిస్తారు.

ఆ తర్వాత వచ్చిన బంధువులు ఇంటివారు అందరూ కూర్చుంటారు. కుల ఆచారం ప్రకారం పొగాకు, బీడీలు తలా ఒకటి కాల్చమని పంచుతారు. ఆ తర్వాత అర్థి బిడ్డ (డోలివారు) చిన్న, పెద్దలు అందరూ కలిసి దినకార్యం ఏ రోజు 3, 4, 7, 9, 11 లేదా 21 రోజులలో దినకార్యం చేయిస్తారు.

**దినకార్యం :**

తద్దినం ఏ రోజున వీలును బట్టి ఏరోజు కులం రావాలో ఎప్పుడు పిట్టకు వేయాలో అనేది మనం నిశ్చయించుకున్న వారంలో వుంటుంది. శనివారమైతే ఆ రాత్రంతా బంధువులు, గ్రామస్థులు, అర్తివారు, వడ్డెలు, బోయిలు అందరూ కలిసి ఆ రాత్రి ఇంటి వేల్పుకు ఆ ఇంటికి ఉన్న వెలుగులో ఆ ఇంటి పేరగల దేవునికి పసుపు కుంకుమలతో పూజించి, అక్కడ ఒక కోడిపిల్లను నైవేద్యం వడ్డెతో చేయించి అప్పుడే ఆర్తి బిడ్డకు, వడ్డెకు, గ్రామస్తుల వారికి చేతనైన రీతిలో సారాయి పోయిస్తారు.

ఆ తర్వాత ఇంట్లకు వెళ్ళి పెద్దకోడి కొయ్యకుండా ఆ కోడిని కాల్లు రెక్కలు కట్టి ఇంటి ముందు ద్వారమునకు అటు, ఇటు కొట్టి ప్రాణం పోయిన తర్వాత ఇంట్లో పడేసి బయటకు వస్తారు.

ఇంటిముందు వచ్చిన బంధువులు, ఉత్సాహంగా ఉన్న వారందరూ పాటలు పాడించుకుంటూ ఎగిరేవారు ఎగురుతారు. చూసేవారు చూస్తారు. ఆ తర్వాత పెద్దల కోడి కూరతో భోజనాలు చూసే ముందు సారా త్రాగి భోజనాలు చేసి సంతోషంగా తెల్లవార్లు జాగారాలు జరుపుతారు. తెల్లవారుఝామున గాదె ముంత అనగా కొత్త గురిగి అందులో సారా పోసి తెల్ల తువాలు వేసుకుని జాగార్లకు వస్తారు. అందులో వున్న సారాను వడ్డెబోయిడు, కులముల తరాయింత తీసుకుని తిమ్మని పాట పాడమని డోలివాని


పాడిస్తూ ఎవరు ఎవరికి బియ్యం ఉంది, ఎవరికి ఎవరు, వడ్డెలు ఎవరికి ఎవరికి వడ్డె తనము చేయాలి, ఎవరికి చేయకూడదు, వడ్డెలెవరు, బోయి లెవరు, అనే రీతిలో ఈ విషయాలు ఈ దినకార్యంలో తేల్చుకుంటారు.

ఆ తర్వాత 7 గంటల సమయంలో పెంటకోల్లని తీసుకొని ఊరిబైటకు వెళ్ళి అవి తీసుకొచ్చేముందు ఇద్దరి చిన్న పిల్లలకు తలదిపార స్నానం చేయించి వారికి పసుపు కుంకుమ రాసి కంకనాలు కట్టి అక్కడుంచబడిన కోళ్ల కాలు రెక్కదారంతో కట్టి అక్కడికి తీసుకెళ్లిన ఇస్తారి పాలకర్రను పూజించి ఆ కాలు రెక్కను ఆ కర్రకు మధ్యలో కట్టి కొత్త కండువ ముసుగు వేసి సంబరాలు తోటి వస్తుంటారు. మార్గ మధ్యలో చిన్న చిన్న ఏడు నగండ్లు పెట్టి నిప్పంటించి వాటిపై నుండి దాటించుకొని ఇంటికి వస్తారు. వాటి మాంసంతో అన్నం, కూరలు తయారైన తర్వాత పిట్ట కూడు పట్టుకొని తలగోరు పట్టిన వ్యక్తికి పిట్టకూడు డొప్ప కొత్త కండువలో పెట్టి పట్టించుకొని కాష్టం వద్దకు తీసుకెళ్ళి అక్కడ కాష్టం చుట్టు మూడుసార్లు తిరిగిన తర్వాత ఒక ఇస్తారి పంగల గుంజె చిన్న దానిని తీసుకొచ్చి దానిని ఇక్కడ కత్తితో బొక్క చేసిన రంధ్రంలో నిలబెట్టి వడ్డె ఆ తీసుకెళ్లిన పిట్ట కలాడులో ఉన్న తలకాయ, కార్జం, కాలు వీటిని కొంచె బారుగా కట్టిన దారం ఉంచుతారు. దానిని వడ్డెచేత తలగోరు పట్టిన వ్యక్తి చేత అటునుండి ఇటు ఆ దారాన్ని వేయిస్తారు.

ఆ తరువాత చిల్లర పైసలు పనివారికి అంటే డోలివారు, చప్పుల్లవారు జంగాలు మొ. వారికి ఎవరికి తోసినంత వారు చిల్లర పైసలు చనిపోయిన వ్యక్తిమీద వేస్తారు.

ఇంటికి తిరిగి వచ్చిన తరువాత తలగోరు పట్టిన వ్యక్తి మరియు వడ్డె భోజనం చేసిన తర్వాత కులం అందరికి భోజనాలు వడ్డిస్తారు. ఆ తర్వాత పనివారికి ఇవ్వవలసిన రీతిలో కట్టడి ఇస్తారు. ఇది చనిపోయిన వ్యక్తికి చేయవలసిన కార్యక్రమం.

ఆదివాసి ప్రజల సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించే క్రమంల నేను సంవత్సరాల నుండి మన ఆదివాసి సంస్కృతి క్షీణించిపోతుందన్న ఉద్దేశ్యంతో ఈ సంస్కృతి సాంప్రదాయాలు ఎలా పరిరక్షించాలనే ఉద్దేశ్యంతో నా తోటి స్నేహితులతో కలిసి మన కులపెద్దలందరిని అదివాసి వివిధ గ్రామాలను సందర్శించి ఆ గ్రామాల కులపెద్దల సహకారంతో నాకు అందిన ఈ సమాచారాన్ని ఎల్లవేళలా మన ఆదివాసి గ్రామాల్లో చిరస్థాయిగా నిలవాలని, ఆధునిక సమాజంలో అడుగిడుతున్న యువతీ యువకులకు మన సంస్కృతి సాంప్రదాయాలు విడనాడుతున్న తరుణంలో వాటిని కాపాడుకోవాలనే సంకల్పంతో నా చిరు ప్రయత్న భాగంలో ఈ చిన్న కరదీపికను తయారు చేయుటలో ప్రధాన భూమిక వహించిన ఉద్యోగులకు, కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అలాగే ఈ కరదీపికలో మన సంస్కృతి, సాంప్రదాయా లలో నేనిచ్చిన సమాచారంలో ఎలాంటి పొరపొచ్చాలు దొర్లినచో దాన్ని సరిదిద్ద గలరని, మీయొక్క సహాయ సహకారాలు అందించాలని కోరుతూ మీ సన్నిహితులు. పి. సమ్మయ్య.



## అప్పాచెన్ 'కొబ్బరిచెట్టునెక్కే నిచ్చెన'ను గీత కార్మికులకు అనుసంధానం

గతంలో కేరళకు చెందిన అప్పాచెన్ కనిపెట్టిన కొబ్బరి చెట్టును ఎక్కే నిచ్చెన 'పల్లెసృజన' పాఠకులకు గుర్తుండే వుంటుంది. ప్రస్తుతం ఆ పనిముట్టు మన రాష్ట్రంలోని గీత కార్మికులకు చాలా ఉపయోగకరంగా వుంటుందని సూచించిన పాఠకుడు వేముల ప్రభాకర్ గారి సూచనతో ఆ పరికరాన్ని గీత కార్మికులకు చూపించి ప్రయోగాత్మకంగా చెట్టును ఎక్కించే పనిలో 'హనీబీఏపి' ముందడుగు వేస్తున్నది. గీత కార్మికులకు అనుకూలంగా కొన్ని చిన్న చిన్న మార్పులు చేయుటకు ఇంజనీరింగ్ విద్యార్థులు నిమగ్నమయ్యారు. అతి త్వరలో ఈ పరికరం గీత కార్మికులకు ఉపయోగకారి కాగలదని ఆశిద్దాం. ఈ కార్యక్రమంలో భాగంగా 'హనీబీఏపి' కో-ఆర్డినేటర్ బ్రిగేడియర్ గణేశం గారు గీత కార్మికునితో చర్చించి ఆ పరికరానికి కావలసిన మార్పులను తెలుసుకోవడం జరిగింది. ఈ పరికరం గీత కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందని 'హనీబీఏపి' భావిస్తోంది.



# తెలుగు ఇన్నోవేటర్లకు భారత ప్రభుత్వ ఆర్థిక సహాయం !

'టెక్నో ఎంటర్‌ప్రెనర్‌షిప్' (టెప్) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ సైన్స్ మరియు టెక్నాలజీ శాఖవారు చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా దేశంలోని ఇన్నోవేటర్లను, ఎంటర్‌ప్రెనర్లను ప్రోత్సాహపర్చటానికి, ఆర్థిక సహాయం, వ్యాపారపరమైన సంధానం సమకూరుస్తారు. దీనిలో అందరూ పాల్గొనవచ్చు.



బంగార్రాజు

హనీబీఎపి తెలుగు ఇన్నోవేటర్లకు ఆర్థిక సహాయానికై టెప్ సంస్థతో సంప్రదింపులు జరిపింది. గత నాలుగు నెలలుగా ఇన్నోవేటర్లతో అప్లికేషన్‌లు, ఇంటర్‌వ్యూలు, పరీక్షలు వగైరాలన్నీ పూర్తి అయినాయి. ఎనిమిది మంది ఇన్నోవేటర్ల అప్లికేషన్లు 'టెప్' గ్రాంటుకు అర్హత సంపాదించుకున్నాయి. వచ్చే రెండుమూడు నెలల్లో వీరికి ఈ గ్రాంటు చేరుతుంది. వారి వివరాలు...


| వ.నెం. | పేరు | గ్రామం, జిల్లా | గ్రాంటు రూపాయల్లో |
|---|---|---|---|
| 1. | బంగార్రాజు | శ్రీశైలం, కర్నూలు | 45 లక్షలు |
| 2. | చింతకింది మల్లేశం | ఆలేరు, నల్గొండ | 5 లక్షలు |
| 3. | మహమ్మద్ ఇష్వాక్ | గద్వాల, మహబూబ్‌నగర్ | 4.5 లక్షలు |
| 4. | మస్తాన్ వలి | కర్నూలు, కర్నూలు | 75 వేలు |
| 5. | కె. వెంకటేశ్వర్లు | ఇల్లాయగూడెం, వరంగల్ | 75 వేలు |
| 6. | శైలేంద్ర కుమార్ | హనుమకొండ, వరంగల్ | 55 వేలు |
| 7. | విక్రం రాథోడ్ | జైత్‌రాం తాండా, ఆదిలాబాద్ | 75 వేలు |
| 8. | కె. జగదీశ్వర్ | ఇల్లాయగూడెం, వరంగల్ | 75 వేలు |



చింతకింది మల్లేశం

గ్రాంటుకు అర్హులైన ఇన్నోవేటర్లకు మా శుభాభినందనలు. వారి ప్రయోగాలు ఈ ఆర్థిక సహాయంతో విజయవంతం కావాలని మనసారా కోరుతున్నాం.

మన రాష్ట్రంలో ఇంకా వెలుగులోకి రాని ఎంతోమంది ఇన్నోవేటర్లు ఉన్న సంగతి పాఠకులందరికీ తెలిసిందే. అలాంటి వారెవరైనా మీకు తెలిసి వుంటే వెంటనే వారి వివరాలను 'పల్లెసృజన' కార్యాలయానికి ఫోన్ ద్వారాగాని, ఉత్తరం ద్వారాగాని తెలియజేస్తే వారి ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు రావటానికి ప్రయత్నించడంతో పాటు వారి ఇన్నోవేషన్ల ద్వారా రాష్ట్ర ప్రజలకు, దేశానికి కూడా ఎంతో ఉపయోగకారి కాగలదని ఆశిస్తున్నాము.



విక్రం రాథోడ్

ఈ గ్రాంటును అందించి, గ్రామీణ ఇన్నోవేటర్లను ఇతోధికంగా ప్రోత్సహించిన 'టెప్' సంస్థ ఛైర్మన్ డా. ఎ.ఎస్. రావు గారికి మా మనఃపూర్వక కృతజ్ఞతలు.


– హనీబీఎపి




జగదీశ్వర్



మహమ్మద్ ఇష్వాక్



కె. వెంకటేశ్వర్లు



శైలేంద్ర కుమార్



మస్తాన్ వలి



# పేటెంట్ గ్రహీత, ఆదిలాబాద్ ఆదివాసి 'విక్రం రాథోడ్'

పేటెంట్ అంటే ఏ అమెరికాలోనో, లేక పరిశోధనలు చేసే శాస్త్రవేత్తలకో లభిస్తుంది అనుకోవడమే కాని, నిరక్షరాస్యులైన ఆదివాసులకు కూడా పేటెంట్ ఇస్తారన్న విషయం మనకువింతగానే వుంటుంది. మన రాష్ట్ర ఆదివాసి విక్రం రాథోడ్‌కు పేటెంట్ రావటం హనీబీఏపి గుండెల్లో ఎంతో ఆనందాన్ని నింపింది.

విక్రం రాథోడ్, జైత్‌రాం తాండా, నవాస్‌పూర్, ఇంద్రవెల్లి మండలం, ఆదిలాబాద్ జిల్లా వాస్తవ్యుడు. తనకున్న నాలుగెకరాల భూమిలో కూరగాయలు, పత్తి, వరి వర్షాధారంగా పండిస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. చిన్న సైకిల్ షాప్ పెట్టుకుని మెకానిక్‌గా ఊళ్ళో వాళ్ళ సైకిళ్ళన్నీ రిపేరు చేస్తాడు. స్వతహాగా మంచి హృదయమున్న వ్యక్తి. అప్పు, సప్పు చేయకుండా ఉన్నదాంట్లోనే సర్దుకునే తత్వం గల కష్టజీవి. వర్షాలు లేకపోతే పంటలు సరిగ్గా వచ్చేవి కావు. రోజు గడవటం కష్టమయ్యేది.

తన పొలం ప్రక్కనే పల్లంలో ఒక చిన్న కుంట ఉంది. దాన్నుంచి నీళ్ళు తన పొలానికి ఎక్కవు. తనకు కరెంటు మోటరు గాని, డీజిలు ఇంజను గాని కొనే తాహతు లేదు. దగ్గరగా వున్న నీళ్ళను పొలంలోకి పారించటానికి మరేమైనా మార్గాలున్నాయేమోనని ఆలోచించసాగాడు.

నీళ్ళుఎత్తిపోసే పంపు డీజిల్‌తో, కరెంట్‌తో నడవదు కదా. దానికి తిరిగే శక్తిని మాత్రమే ఇవ్వాలి. అయితే ఈ శక్తిని సైకిల్ ద్వారా కూడా ఇవ్వవచ్చని గ్రహించాడు. అంతే రెండు వారాల్లో సైకిల్‌ను ఒక పంపుకు పుల్లీలు, బెల్టు ద్వారా కనెక్ట్ చేసి, పెడలింగ్ చేయగానే పంపు ప్రెషర్‌తో నీళ్ళను తోడటం ప్రారంభించింది. ఈ ఆరంభ విజయంతో ప్రోత్సాహితుడై, మరిన్ని ప్రయోగాలు చేసి ఆవిష్కరణను అభివృద్ధి పరచాడు. దీంతో తక్కువ సైకిల్ నడపటం ద్వారాఎక్కువ నీరు, మంచి ప్రెషరు, ఇరవై పైపుల దూరం వరకు నీళ్ళు ప్రవహించటం సాధ్యమైంది. విక్రం ఆనందానికి అంతం లేదు. కరెంటు, డీజిల్‌పై ఆధారపడకుండా, ఖర్చు లేకుండా తన శ్రమతో పొలం పండించుకునే విధానాన్ని తయారు చేయగలిగాడు విక్రం. ఆదిలాబాద్ జిల్లా వాసులు, ముఖ్యంగా రైతులు కోకొల్లలుగా వచ్చి ఈ అతి సులభమైన పరికరాన్ని రైతుమిత్రమైన ఈ సాధనాన్ని చూశారు, ఆనందించారు, అభినందించారు.

**ఈ సాధనం వల్ల లభించే ముఖ్య లాభాలు.**

- తక్కువ శక్తితో ఎక్కువ నీటి ప్రెషర్ రావటం.
- సైకిల్ నడపటాన్ని చాలావరకు తగ్గించటం.
- సులభంగా ఆపరేట్ చేయడం, సైకిల్ నడపటం ద్వారా రైతు అలసిపోకుండా ఉండటం.
- ఈ సాధనంతో కాలువలు, చెరువులు, బావులు, కుంటల నుండి సులభంగా నీరు పంపు చేయవచ్చు.
- పంపుకు అవసరాన్ని బట్టి శక్తి ఇవ్వబడుతుంది. ఇంజన్లు, మోటర్లలా నిర్దిష్టమైన హార్స్‌పవర్, లేక కిలోవాట్ పవర్ ఇచ్చి వృధా చేసుకోనవసరం లేదు.
- శక్తిని పంపు డైరెక్టుగా కాకుండా ఇన్‌డైరెక్టుగా ఇవ్వడం.
- ఈ సాధనాన్ని సులభంగా ఒకచోటినుండి




మరోచోటికి మార్చుకోవచ్చు.

హనీబీ నెట్‌వర్క్ విక్రం రాథోడ్ సృజనాత్మక శక్తిని గుర్తించి ఆర్థిక సహాయం చేసింది. ఐ.టి.డి.ఎ. కూడా విక్రంను బాగా ప్రోత్సహించింది. ఈ వినూత్న సహజ సాధనాన్ని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ 'జాతీయ బహుమతి'కి ఎన్నుకుంది. 2003లో అప్పటి భారత రాష్ట్రపతి శ్రీ అబ్దుల్ కలాం ద్వారా మన విక్రం రాథోడ్ జాతీయ బహుమతి అందుకున్నాడు. అక్కడితో ఆగకుండా హనీబీఏపి, ఎన్.ఐ.ఎఫ్. ద్వారా పై సాధనానికి పేటెంట్ కై ప్రయత్నించింది. అందరి సహకారం, ఎన్.ఐ.ఎఫ్. సభ్యుల నిర్విరామ కృషి ఫలించి, నిరక్షరాస్యుడు, ఆదివాసి, పల్లె నివాసి, సహజ శాస్త్రజ్ఞుడైన శ్రీ విక్రం రాథోడ్‌కు భారత పేటెంట్ చట్టం ప్రకారం 'సైకిల్‌తో నడిచే నీటిపంపు' కు పేటెంట్ నెం. 211878 ప్రసాదించింది. ఈ పేటెంట్ అధికారం 2004వ సంవత్సరం నుండి 20 సంవత్సరాల వరకు విక్రం రాథోడ్‌కు ఉంటుంది.

జ్ఞానం సర్వత్రా వుంటుందని, దాన్ని వెతికి, వెలికి తీసి, వెలుగులోకి తెస్తే సమాజానికి ఎంతో ఉపయోగ పడుతుందన్న హనీబీ నెట్‌వర్క్ విశ్వాసం, హనీబీఏపి కృషి, ఎన్.ఐ.ఎఫ్. సహకారానికి విక్రం రాథోడ్ పేటెంట్ ఒక ప్రతీక.

ఇలాంటివి మరెన్నో పేటెంట్లు మన తెలుగు పల్లె జ్ఞానులకు లభించగలవన్న మా ప్రగాఢ విశ్వాసాన్ని గుర్తు చేసుకుంటూ ముందుకు సాగుదాం.



क्रमांक : Sl. No. : 044 2804

INTELLECTUAL PROPERTY INDIA

PATENTS | DESIGNS | TRADE MARKS | GEOGRAPHICAL INDICATIONS

भारत सरकार
GOVERNMENT OF INDIA
पेटेंट कार्यालय
THE PATENT OFFICE
पेटेंट प्रमाणपत्र
Patent Certificate
(Rule 74 of Patents Rules)

Patent No. : 211878

Application No. : 371/CHE/2004

Date of Filing : 23/04/2004

Patentee : VIKRAM RATHORE

It is hereby certified that a patent has been granted to the patentee for an invention entitled CYCLE OPERATED WATER LIFTING PUMP as disclosed in the above mentioned application for the term of 20 years from the 23 day of APRIL 2004, in accordance with the provisions of the Patents Act,1970.

Date of Grant: 13/11/2007

Controller of Patents


Note.-The fees for renewal of this patent,if it is to be maintained , will fall / has fallen due on 23 day of APRIL 2006 and on the same day in every year thereafter.

## గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక 'పల్లెసృజన'

పల్లెసృజన ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

-సంపాదకవర్గం


# మల్టీ పర్పస్ బకెట్ : 'సౌకర్యమైన బాత్రూం సెట్'



మహారాష్ట్రకు చెందిన దత్తాత్రేయ కన్హయ్య దుడాలే ఎన్.ఐ.టి. వరంగల్‌లో ఎం.టెక్ విద్యార్థి హాస్టల్‌లో వుంటూ చదువును కొనసాగిస్తున్నాడు. రోజూ ఉదయాన్నే కాలకృత్యాలకై హాస్టల్ విద్యార్థులు కామన్ బాత్రూంలకు వెళ్తారు. బకెట్, మగ్గు, బ్రష్షు, పేస్ట్, సబ్బు, షేవింగ్ సమాను వగైరాలన్నీ తీసుకు వెళ్ళాల్సి వస్తుంది. విడివిడిగా తీసుకు వెళ్ళడం, బాత్రూంలో వాటిని సర్దుకునేందుకు తగినంత స్థలం లేక రోజూ ఇబ్బంది పడేవాడు. "అవసరం అన్వేషణకు దారి తీస్తుంది" అన్నట్టుగా దత్తాత్రేయ ఈ రోజువారి సమస్యకు పరిష్కారం కనుగొన్నాడు.

బకెట్‌లోనే బాత్రూంకు తీసుకు వెళ్ళాల్సిన వస్తువులన్నీ మూడు బాగాలుగా అమర్చాడు. మొదటి భాగంలో సబ్బు, సబ్బు పెట్టె, రెండవ భాగంలో షేవింగ్ బ్రష్, క్రీం, రేజర్, మూడవ భాగంలో టూత్‌బ్రష్, పేస్ట్, టంగ్ క్లీనర్. వీటన్నిటీ బకెట్ అంచుపై బయట వైపు అమర్చాడు. (బొమ్మ చూడండి).

అయితే ఇన్నోవేషన్ ఇంకా డెవలప్‌మెంట్ స్థాయిలోనే వుంది. దత్తాత్రేయ దీన్ని ఇంకా పకడ్బందీగా తయారు చేయాలని, వాడుకునేవారికి ఎంతో అనువుగా వుండేట్లు, బకెట్‌కు భారీగా కాకుండా, అదనపు బరువు కనీసమాత్రంగానే వుండేట్లు బకెట్‌పై ఈ భాగాలను సులభంగా బిగించేట్టు, ధర విద్యార్థులకు అందుబాటులో ఉండేట్టు చేయాలని శ్రద్ధగా శ్రమిస్తున్నాడు.




దత్తాత్రేయ సృజనాత్మక బకెట్ సెట్‌తో హాస్టల్ విద్యార్థులు రోజూపడే కష్టాలు కొంతవరకు తగ్గుతాయని ఆశిద్దాం.

ఇన్నోవేటర్ వివరాలు : దత్తాత్రేయ కన్హయ్య దుడాలే (డి.కె. దుడాలే),
మొబైల్ : 90004 17206
E-mail : krrish9march@rediffmail.com

**మన సమాజానికి దత్తాత్రేయ దుడాలే వంటి ఇంజనీర్ల అవసరం ఎంతైనా ఉంది. పిల్లలు డాక్టర్లయితే తల్లిదండ్రులకు వైద్యం చేస్తారు. లాయరైతే న్యాయానికి కృషి చేస్తారు. మరి ఇంజనీర్లయితే తల్లిదండ్రులకు ఏం చేస్తారు? అసలు విషయం ఏమిటంటే కుటుంబం కాని, సమాజం కాని వారినుండి ఏమీ ఆశించదు. ఎంత ఆశ్చర్యమైన విషయం కదా!**

**ఇంజనీర్లు తమ కుటుంబాలకు ఏమీ చేయలేరా? లేదా చేద్దామని అనుకోరా? ఇంజనీర్లు ప్రధానంగా సాంకేతిక జ్ఞానాన్ని వాడి, దైనందిక జీవితంలో మానవజాతికి అధిక సౌకర్యాలను సమకూరుస్తారు. అదీ వారిపని. అయితే వారు తమ తల్లిదండ్రులకు చేసే పనుల్లో కొన్నిటిని తగ్గించడానికి, లేదా వారి శ్రమను తగ్గించడానికి ప్రయత్నం చేయవచ్చు. అలా కాకుండా మెజారిటీ ఇంజనీర్లు ఇతర దేశాలకు, పెద్దపెద్ద పరిశ్రమలకు, ప్రభుత్వ కార్యక్రమాలకు తమ జ్ఞానాన్ని వాడుతున్నారు. ఇవన్నిటితోపాటు, ఇంజనీర్లు తమ తల్లిదండ్రుల సౌఖ్యం, కుటుంబ సౌఖ్య, గ్రామ సౌఖ్యాన్ని గురించి కూడా కొంచెం ఆలోచిస్తే ఇంకా బాగుంటుంది. దీనికై తగు రీతిలో పెద్దలు, తల్లిదండ్రులు, కాలేజీ ప్రొఫెసర్లు ఇంజనీరింగ్ విద్యార్థులపై తగిన వత్తిడి తీసుకు వస్తే తప్పకుండా చేస్తారన్న విశ్వాసం మాకుంది. ఈ విధంగా ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి ప్రోత్సహింపబడి తమ కుటుంబం కోసం ఏదైనా తయారు చేస్తే దాదాపు పది లక్షల కుటుంబాలు ఎంతో ప్రభావితం కావడంతో పాటు, సమాజానికి కూడా అంతులేని సహాయమందించినవారవుతారు.**

**-సంపాదకులు.**

తాతయ్య, అమ్మమ్మ, నానమ్మల నుండి జ్ఞానానికి సంబంధించిన కబుర్లు మీరు వినడానికి ఎప్పుడైనా ప్రయత్నించారా? ఏకాగ్రతతో రెండుగంటలు వారితో గడపండి. ఆ కబుర్లను మాకు వ్రాసి పంపండి. వారి అనుభవాల పొరల్లో ఎన్నో జ్ఞానాలు దాగుంటాయి. ప్రచురణకు అనువైన వాటిని 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. వ్యాసాలను పంపేటప్పుడు మీ ఫోటోతో పాటు మీకు కబుర్లందించిన వారి ఫోటోలను కూడా తప్పక పంపండి. ఈ అపూర్వ సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకు వచ్చి, భావితరాలకు అందజేయటానికి మీ సహకారాన్ని కోరుతున్నాము. **- ఎడిటర్.**

## 'హనీబీఏపి' అంతరాత్మ

# పల్లె సృజన

'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సంస్థ లక్ష్యాలను సాధించటానికి 'హనీబీ' (తేనెటీగ) అనే పేరుతో ఒక యంత్రాంగం రూపొందించబడింది. తేనీటీగ అత్యుత్తమ నిస్వార్థ ప్రాణి. పూలల్లో వున్న మకరందాన్ని ఆస్వాదించి, తన శ్రమతో దాన్ని తేనెగా తయారు చేసి మానవాళికి అందజేస్తుంది. మూవుకు నష్టం వాటిల్లకుండా, ప్రజానీకానికి లాభమయ్యేటట్లుగా చాకచక్యంతో కార్యాన్ని నిర్వర్తిస్తుంది. ఈ తేనెటీగ జీవన సరళియే ఉద్దేశ్యంగా 'హనీబీ' స్వచ్ఛంద సంస్థ మరుగున పడివున్న గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయకంగా వాడే పద్ధతులు, సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి కృషి చేస్తున్నది. ప్రజలనుండి మనం ఏదైనా జ్ఞానాన్ని సేకరించినపుడు, వారు గరీబులుగా మారకూడదు. వారి అంతరాంతరాల్లోని ఆలోచనల్ని మనతో పాలు పంచుకొన్నప్పుడు వారికి అంతో ఇంతో లాభం జరగడం సబబు. అందుకే మనం వారి సరికొత్త ఆలోచనలను వారి స్థానిక భాషలోనే చర్చించాలి. వారికి తగిన సమాచార సామగ్రిని అందించాలి. సరికొత్త ఆలోచనలన్ని మనముందు వెల్లడిస్తున్న వ్యక్తికి ఆ ఆలోచనలతో మనమేమి చేస్తామో తెలియాలి. వారి పరిజ్ఞానాన్ని విస్తారం చేయడం ద్వారా ఎంతోకొంత ఆదాయాన్ని వీరికి సమకూర్చాలి. ఇది వీలైనంత పారదర్శకంగా ఉండాలి.

ప్రజల మధ్య అభ్యాసానికి 'పల్లెసృజన' ఒక ప్రయోగం వంటిది. మనం ఇంగ్లీషులో రాస్తాము. అది ప్రపంచమంతటికి వ్యాపిస్తుంది. కానీ, స్థానికులను పరాయి వారిని చేస్తుంది. మనం ఎక్కడి నుండి నేర్చుకున్నామో అక్కడికి చేరుకోలేము. ఒకవైపు మనం ఎదుగుతూ ఉంటాం. కెరీర్‌లో ఒక్కొక్క శిఖరాన్ని అధిరోహిస్తాము. వృత్తి సంబంధమైన పురస్కారాల్ని అందుకుంటాము. ఇదే సమయంలో మన ఆలోచనలలో భాగస్వామి అయినా స్థానికుడు బాధలు పడతాడు. మౌనంగా వేదనకు లోనవుతాడు. విజ్ఞాన సేకరణ, దాన్ని పత్రరూపంలో సిద్ధం చేయడం (డాక్యుమెంటేషన్), ఆ విజ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేయడం, వాటికి సిద్ధాంతాల్ని, రూపాన్ని కల్పించడం, సంస్థలకు పరిచయం చేయడం, నైతిక సూత్రాల పాటింపు, హనీబీ ఆలోచనల్లో ప్రధానమైనవి. ఈ విజ్ఞానాన్ని విస్తారంగా ప్రచారం చేయడానికి 'పల్లెసృజన' తెలుగునాట కృషి చేస్తున్నది. హనీబీ యంత్రాంగానికి చేయూత నందించాలి. అనుకున్నట్టయితే మీరూ మా పత్రిక వార్షిక చందా లేదా జీవత కాలపు చందాలతో ముందుకు రండి. మీ సృజనలను, ఆలోచనలను మాకు ప్రచురణకై పంపండి.


### చందా వివరాలు


| | | వ్యక్తిగతం | సంస్థ / లైబ్రరీ |
|---|---|---|---|
| సంవత్సరానికి | : | 100/- | 1,000/- |
| రెండు సంవత్సరాలకు (ఒక పాత సంచిక ఉచితం) | : | 175/- | 1,750/- |
| మూడు సంవత్సరాలకు (రెండు పాత సంచికలు ఉచితం) | : | 250/- | 2,500/- |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | : | 400/- | 4,000/- |

**మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కులను**
**శ్రీమతి పి. అరుణ గణేశం పేరున హైదరాబాద్‌లో చెల్లునట్లు**
**ఈ క్రింది చిరునామాకు పంపించండి.**

అసోసియేట్ ఎడిటర్, పల్లె సృజన
102 , వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 98660 01678
e-mail : honeybeeap@gmail.com

## ఎన్.ఐ.ఎఫ్. 'ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేట్స్....'
## సంకలనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేశారు





CONTENTS

ANDHRA PRADESH
INNOVATES

PART I
INNOVATIONS FROM A P | 11

PART II
HERBAL PRACTICES & PRODUCTS | 41

PART III
INNOVATIONS FOR A P | 57

నాలుగో వసంతంలోకి అడుగిడటానికి ముస్తాబు కాబోతున్న

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక
రూ. 15/-లు
మాత్రమే



# పల్లెసృజన

పత్రిక రెగ్యులర్ చందా దారులు కండి
పల్లె జ్ఞానశోధనకు సహకరించండి!

## పల్లెసృజన చందా వివరాలు

| | వ్యక్తిగతం | సంస్థ / లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | : 100/- | 1,000/- |
| రెండు సంవత్సరాలకు (ఒక పాత సంచిక ఉచితం): | 175/- | 1,750/- |
| మూడు సంవత్సరాలకు(2 పాత సంచికలు ఉచితం): | 250/- | 2,500/- |
| ఐదు సంవత్సరాలకు(4 పాత సంచికలు ఉచితం) | : 400/- | 4,000/- |

మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కులను
శ్రీమతి పి. అరుణ గణేశం పేరున హైదరాబాద్‌లో చెల్లునట్లు
ఈ క్రింది చిరునామాకు పంపించండి.

అసోసియేట్ ఎడిటర్, పల్లె సృజన
102 , వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 98660 01678
e-mail : honeybeeap@gmail.com

Narendra Graphics, Hyd. Ph. : 93913 75655